## ఓటమి భయంతోనే వైసిపి నేతల దాడి

విజయవాడ, వైసీపీ నేతలు ఓటమి భయంతో ఫ్రస్టేషన్‌లో దాడులకు దిగుతున్నారని విజయవాడ తెలుగుదేశం పార్లమెంటు అభ్యర్థి కేశినేని చిన్ని అన్నారు. మంగళవారం నాడు నందిగామలో వైసీపీ దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు కిషోర్, నరసింహారావులను ఆంధ్రా హాస్పిటల్‌లో ఆ పార్టీ నాయకులు కేశినేని చిన్ని, నెట్టం రఘురామ్, కార్యకర్తలు పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ... నందిగామలో టీడీపీ కార్యకర్తలు కిషోర్, నరసింహారావులపై వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు గ్యాంగ్ దాడి చేశారని మండిపడ్డారు. మూడు రాజధానుల అంశంపై తమ కార్యకర్తలు ప్రశ్నిస్తే మొండితోక జగన్మోహన్‌రావు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు 307 కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి సంబంధించిన సీసీ ఫుటేజ్ దర్యాప్తు చేయాలని కోరారు. ఈ దాడిపై విజయవాడ సీపీ,ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. పోలీసులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. నందిగామలో మొండితోక బ్రదర్స్ అరాచకాలు పెరిగిపోయాయని మండిపడ్డారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :43 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: గురువారం 04-04-2024 | పేజీలు:4 వెల: 2.00


## రైతులకు తక్షణమే రూ.2 లక్షల రుణమాఫీ చేయండి



హైదరాబాద్: రైతులకు తక్షణమే రూ.2లక్షల రణమాఫీ చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రైతు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారని, నాలుగు నెలలవుతున్నా ఒక్క రైతుకు కూడా మాఫీ కాలేదని విమర్శించారు. రైతులకు బ్యాంకులు నోటీసుల మీద నోటీలు ఇస్తూ కిస్తీ చెల్లింలచాలంటున్నాయని, తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించి తీరాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నాయని చెప్పారు. ఆర్థిక భారంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుకున్నారని తెలిపారు. అందువల్ల రూ.2 లక్షల రుణమాఫీ ఎప్పట్లోగా చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ లేఖ రాశారు.'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9 నాడే 2 లక్షల రూపాయల రుణమాఫీ ఒకేసారి చేస్తామని మీరు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ పొందిన రైతులు కూడా మళ్లీ బ్యాంకులకు వెళ్లి 2 లక్షల రూపాయల రుణాలు తీసుకోవాలని మీరే స్వయంగా పిలుపునిచ్చారు. మీ మాటను నమ్మి రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్నారు. డిసెంబర్ 9 నాడు మీరు ప్రకటించినట్టుగా రుణమాఫీ జరగలేదు. మీరు అధికారంలోకి వచ్చి దాదాపు 4 నెలలు కావొస్తున్నది. అయినప్పటికీ ఒక్క రైతుకు కూడా ఒక్క రూపాయి రుణ మాఫీ కాలేదు.బ్యాంకులు మాత్రం రైతులకు నోటీసుల మీద నోటీసులు ఇస్తున్నాయి. ప్రభుత్వ హామీతో తమకు సంబంధం లేదని, తీసుకున్న అప్పుకు వడ్డీతో సహా కిస్తీలు చెల్లించి తీరాల్సిందేనని ఒత్తిడి తెస్తున్నాయి. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి మెదక్ జిల్లాలో వందలాది మంది రైతులకు బ్యాంకు నోటీసులు అందాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తీసుకున్న అప్పుకు వడ్డీ మీద వడ్డీ పెరిగి రైతులపై పెను ఆర్థిక భారం పడుతున్నది. బ్యాంకులు రైతులను డిఫాల్టర్ల జాబితాలోకి ఎక్కిస్తున్నాయి. సిబిల్ రేటింగ్ కూడా దారుణంగా పడిపోతున్నది. రైతుల పిల్లలు చదువు కోసం విద్యారుణాలు తో పాటు ఇతర రుణాలు పొందలేక పోతున్నారు. ఈ సమస్యలతో రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.కేసీఆర్ నాయకత్వంలో రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రెండు సార్లు రూ.లక్ష చొప్పున 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసింది. ఏ ఒక్క బ్యాంకు కూడా రుణాలు చెల్లించాలని ఎప్పుడూ రైతులపై ఒత్తిడి తీసుకురాలేదు. లక్ష రూపాయల వరకు రైతులకు సంబంధించిన రుణాలను మేమే కడతామని బ్యాంకర్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం ముందస్తు హామీ ఇచ్చింది. దాని ప్రకారమే ప్రభుత్వ ఖజానా నుంచి బ్యాంకులకు చెల్లింపులు చేసింది. ఫలితంగా లక్షలాది మంది రైతులు ఎలాంటి ఇబ్బందీ లేకుండా రుణమాఫీ పొందగలిగారు. కానీ రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి విధానమూ ప్రకటించకపోవడం, ఈ బడ్జెట్ లో రుణమాఫీ ప్రస్తావన లేకపోవడం వల్ల రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. రుణమాఫీపై ప్రభుత్వం నేటివరకు అటు బ్యాంకర్లకు కానీ, ఇటు రైతులకు కానీ ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. రుణాలు మేమే చెల్లిస్తామని, రైతులపై ఒత్తిడి తేవొద్దని బ్యాంకర్లను ప్రభుత్వం ఆదేశించలేదు. ఎవరైనా రైతులు వడ్డీ భారం పడకుండా రుణాలు చెల్లిస్తే వారికి ప్రభుత్వం తిరిగి నగదు ఇస్తుందా, లేదా? అనే విషయంపైనా స్పష్టత లేదు. ఈ అనిశ్చితి.. గ్రామాల్లో రైతులకు, బ్యాంకర్ల మధ్య చిచ్చు పెడుతున్నది. స్థానిక బ్యాంకు మేనేజర్లకు వారి ఉన్నతాధికారుల నుంచి లోన్ రికవరీ కోసం నోటీసులు వస్తున్నాయి. దీంతో వారు రైతుల మీద పడుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ హామీని కూడా అమలు చేయకపోవడం వల్ల వారు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందక, పంటలు ఎండిపోయి, సకాలంలో నీళ్లు అందక, ఈ నాలుగు నెలల కాలంలో 209 మంది అన్నదాతలు చనిపోయారు. రుణమాఫీ విషయంలో బ్యాంకర్ల ఒత్తిళ్లకు, వేధింపులకు తట్టుకోలేక రైతులు ప్రాణం తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.రుణమాఫీ విషయంలో మీరు తక్షణం స్పందించాలని డిమాండ్ చేస్తున్నాను. 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీని ఎప్పట్లోగా చేస్తారో స్పష్టమైన తేది ప్రకటించాలని రైతుల పక్షాన కోరుతున్నాను. రైతుల రుణాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని బ్యాంకర్లకు హామీ పత్రం రాసివ్వాలని విన్నవించుకుంటున్నాను. దేశానికి అన్నం పెట్టే రైతుకు భరోసా ఇవ్వడం ప్రభుత్వ కనీస బాధ్యత.తెలంగాణ వ్యవసాయిక రాష్ట్రం. వ్యవసాయం మీద ఆధారపడిన కుటుంబాలు 70 శాతం వరకు ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో ఉన్న రైతులను గోస పెట్టడం ఏమాత్రం సమ్మతం కాదు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్న పెద్దల మాట మీకు నేను గుర్తు చేయాల్సిన అవసరంలేదు. రైతుల బాధలు, కష్టాలు, కన్నీళ్లు తొలగించే విధంగా.. మీరిచ్చిన హామీలన్నిటినీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు, పంట మద్దతు ధరపై 500 రూపాయల బోనస్, ఎకరానికి 15 వేల చొప్పున పెట్టుబడి సాయం, పంటపొలాలకు నీళ్లు, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తున్నాను.' అని లేఖలో పేర్కొన్నారు.

## ఫోన్‌ట్యాపింగ్‌పై కాకుండా.. వాటర్ ట్యాప్‌ల మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలి



హైదరాబాద్: తెలంగాణలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో గొంతు ఎండి మంచినీళ్లు మహాప్రభో అని అంటున్నారని, చుక్క నీటికోసం అల్లాడుతున్నారని చెప్పారు. మహిళలు బిందెలు పట్టుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నీటికోసం అల్లాడాల్సిన పరిస్థితి తలెత్తలేదని వెల్లడించారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, వివేకానందతో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో నేడు ట్యాంకర్లు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయన్నారు. నగరంలో ట్యాంకర్ల దందా జోరుగా సాగుతున్నదని విమర్శించారు. మూడు, నాలుగు రెట్లు అధికంగా చెల్లించి వాటర్ ట్యాంక్‌తో నీళ్లు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు.మిషన్ భగీరథను సక్రమంగా నిర్వహించడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని చెప్పారు. అబద్ధాల పునాదులపైనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని విమర్శించారు. తాగునీళ్లు లేక ప్రజలు, సాగునీళ్లందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇది ప్రకృతి ప్రకోపం వల్ల వచ్చిన కరువు కాదని, అసమర్ధ కాంగ్రెస్ వల్ల వచ్చిన కరువని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీళ్లు ఉన్నా వినియోగించడం ఈ ప్రభుత్వానికి చేతకవాడం లేదన్నారు. ఫోన్‌ట్యాపింగ్ మీద కాకుండా వాటర్ ట్యాప్ మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. చేరికల కోసం పార్టీ గేట్లు ఎత్తడం కాదు.. రైతుల కోసం ప్రాజెక్టుల గేట్లు ఎత్తండని ముఖ్యమంత్రికి సూచించారు.ఈ ప్రభుత్వానికి ధన వనరులను ఢిల్లీకి తరలిస్తున్న శ్రద్ధ జనవనరులను తరలించడంపై లేదన్నారు. ఇవాళ తాగునీళ్ల కోసం అడుక్కోవాల్సి దుస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. హైదరాబాద్‌లో మళ్లీ ఇన్వర్టర్లు, జనరేటర్లు వచ్చాయన్నారు. కాళేశ్వరంపై నోటికొచ్చినట్లు విషప్రచారం చేశారని, కేసీఆర్ జనగామ, సూర్యాపేట వెళ్లగానే అదే కాళేశ్వరం నుంచి జలాలను విడుదల చేశారని చెప్పారు. కాళేశ్వరం పంపులను ఆన్ చేసి, మేడిగడ్డ మరమ్మతులు చేస్తే రైతులకు ఈ దుస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. హరీశ్ రావు మల్లన్న సాగర్ నీటి కోసం అల్టిమేటం ఇస్తే వెంటనే విడుదల చేశారన్నారు. కాళేశ్వరం నీటిని కొండపోచమ్మ వరకు తీసుకురావచ్చని చెప్పారు.పుష్కలంగా నీళ్లుంటే ట్యాంకర్లు ఎందుకు కొనక్కోవాల్సి వచ్చిందన్నారు. పంటలు పండితే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కాంగ్రెస్ సాగునీళ్లవ్వడం లేదని ఆరోపించారు. నీళ్ల ట్యాంకర్లను ఫ్రీగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ కుట్రతో ప్రజల కనీస అవసరమైన తాగునీళ్లు ఇవ్వకుండా చేశారని విమర్శించారు. బెంగళూరులో నీటి వృథాకు జరిమానా విధించాలని అక్కడి ప్రభుత్వం అంటున్నదని, ఇక్కడ వంద రోజులుగా నీళ్లను ఎత్తిపోయకుండా ఉన్న ఈ ప్రభుత్వంపై ఏం జరిమానా విధించాలని ప్రశ్నించారు. తాము అధికారం నుంచి దిగిపోయేనాటికి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీళ్లున్నాయని చెప్పారు. ప్రజల నుంచి ముక్కు పిండేలా బిల్లులు వసూలు చేయరాదని, ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ముఖ్యమంత్రికి పాలనా అనుభవంలేదని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో 218 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ వివరాలన్నీ ముఖ్యమంత్రికి పంపిస్తామన్నారు. రేవంత్ రెడ్డి రాహుల్ కోసం పనిచేస్తున్నారో లేదా మోదీ కోసం పనిచేస్తున్నారో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. తనకు ఎలాంటి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం లేదని స్పష్టం చేశారు. అప్రతిష్టపాలు చేసేవారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలో చేరి మళ్లీ పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై కచ్చితంగా కోర్టుకు వెళ్లామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్, ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక ఖాయమన్నారు. మందకృష్ణ మాదిగ కూడా ఇదే విషయం మాట్లాడారని చెప్పారు.

## శ్రీలంక చేరుకున్న ముగ్గురు రాజీవ్‌గాంధీ హత్య కేసు దోషులు

చెన్నై: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకేసులో దోషులుగా ఉన్న ముగ్గురు శ్రీలంక వాసులు ఇవాళ తమ స్వదేశం చేరుకున్నారు. శ్రీలంక చేరుకున్న వారిలో మురుగన్ అలియాస్ శ్రీహరన్, జయకుమార్, రాబర్ట్ పయాస్ ఉన్నారు. రాజీవ్ గాంధీ హత్య కేసులో 2022 నవంబర్‌లో సుప్రీంకోర్టు ఏడుగురు దోషుల్ని రిలీజ్ చేసింది. అయితే ఆ దోషులు రిలీజైన తర్వాత తిరుచిరాపల్లిలో ఉన్న ప్రత్యేక క్యాంపులో ఉన్నారు. అక్కడ నుంచి నిన్న చెన్నై చేరుకున్న వాళ్లు.. ఇవాళ లంక రాజధాని కొలంబోకు వెళ్లారు. డిపోర్టేషన్ ఆర్డర్ ఆదేశాలు వచ్చిన తర్వాత వాళ్లు స్వదేశానికి వెళ్తారని తమిళనాడు సర్కార్ ఇటీవల మద్రాసు హైకోర్టుకు వెల్లడించింది. చెన్నైలో ఉన్న శ్రీలంక హై కమీషన్.. ఆ ముగ్గురికీ ట్రావెల్ డాక్యుమెంట్లను అందజేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మరో వ్యక్తి శంతన్ ఇటీవల మృతిచెందాడు. ఈ కేసులో విముక్తి పొందిన భారతీయుల్లో



పెరారివాలన్, రవిచంద్రన్, నళిని ఉన్నారు. ఈ ఏడుగురూ 30 ఏళ్ల జైలు జీవితం అనుభవించారు.

## కూటమికి పెరిగిపోతున్న కష్టాలు...!



అమరావతి, కూటమికి కష్టాలు అలా పెరిగిపోతున్నాయి. 2014 నాటి మ్యాజిక్ రిపీట్ అనుకుంటూ కూటమి కట్టారు కానీ 2024 నాటి పరిస్థితులు వేరుగా మారుతున్నాయి. ఆనాడు బీజేపీ పూర్తిగా సహకరించింది. జనసేన అయితే ఔట్ రైట్ గా బయట నుంచి మద్దతు ఇచ్చింది. దాంతో పొత్తు పేచీలు ఏవీ లేకుండా కథ సుఖాంతం అయింది. ఏపీ మీద నాడు బీజేపీ కేంద్ర నాయకులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వచ్చారు. ప్రధాని అభ్యర్థిగా ఉన్న నరేంద్ర మోడీ కూటమికి ఆక్సిజన్ గా నిలిచారు. ఇలా మిత్రుల పూర్తి సహకారంతో కూటమికి ఎన్నికల ముందే అధికారం కళ కొట్టొచ్చినట్లుగా కనిపించింది. కానీ ఈసారి మాత్రం అంతా ఉల్టా సీదా గా సాగుతోంది అని అంటున్నారు. కూటమి ఏర్పాటు ఆలస్యంగా సాగింది. మనసులు కలవని మనువుగా ఈ కూటమి ఉందని అంటున్నారు. కూటమికి పెద్దన్న ఎవరు అన్నది తెలియడం లేదు. ఎవరికి వారు యమునా తీరేగా పరిస్థితి ఉంది. నాడు చంద్రబాబు పూర్తిగా కూటమికి సారథ్యం వహించారు. వ్యూహాలు అన్నీ ఆయనే చూసుకునేవారు. అందరూ నాడు బాబు మాట వినేవారు. ఇపుడు సొంత పార్టీలో కూడా రెబెల్స్ తయారై చంద్రబాబుని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇక మిత్రుల కథ సరేసరి. ఇచ్చిన సీట్లలో అసంతృప్తులు ఉన్నాయంటున్నారు. అదే సమయంలో ఆయా పార్టీలలో ఉన్న వర్గ పోరు కూడా కూటమికి సెగ పెంచేస్తోంది. ఏపీలో ఎన్నికలు ఈసారి మే 13న ఉన్నాయి. అంటే నాలుగవ దశ అన్న మాట. ఈ దశ అయితే కూటమికే అతి పెద్ద అడ్వాంటేజ్ కావాల్సినంత సమయం ఉంది అని మొదట్లో భావించారు. కానీ చూడబోతే ఆ ఎక్కువ సమయమే కూటమికి మిక్కిలి కష్టాలు తెచ్చిపెడుతోంది అని అంటున్నారు. కాలం ఎక్కువ అయ్యే కొద్దీ రోజులు గడిచే కొద్దీ కూటమిలో సర్దుబాట్లు కుదరకపోగా అవి మరింతగా ఎక్కువ అవుతున్నాయి. ఎంతదాకా అంటే ఇంకా టైం ఉంది కదా ఫలానా చోట అభ్యర్థిని మార్చండి అని సొంత పార్టీ నుంచి ధిక్కార స్వరాలు వినిపిస్తూంటే మిత్రులు కూడా అదే డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ అయితే ఎంపీ సీట్ల విషయంలో మళ్లీ మార్పులు చేయమంటోంది. విశాఖ ఎంపీ సీటు ఆ పార్టీ కోరుకుంటోంది. అలాగే ఎమ్మెల్యే సీట్లలో తమకు నచ్చిన చోట ఇమ్మని కోరుతోంది.జనసేన విషయం చూస్తే ఆ పార్టీ తలనొప్పులు ఇంకా ఎక్కువగా ఉన్నాయి. అవన్నీ కలసి కూటమి మీదనే ప్రభావం చూపిస్తున్నాయి. అందరికీ సర్దిచెప్పుకునే బాధ్యత టీడీపీ మీదనే పడుతోంది. టీడీపీకి ఈసారి ఎన్నికలు చావో రేవో అన్నట్లుగా ఉన్నాయి. దానికి తోడు కూటమిలో కలహాలు వర్గ పోరు సమస్యలు అన్నీ నెత్తిన పడుతున్నాయి. పోలింగ్ కి సరిగ్గా నలభై రోజులు మాత్రమే సమయం ఉన్నా ఇంకా కూటమిలో బాలరిష్టాలు తీరడం లేదు. ఉమ్మడిగా ఒకే ఒక సభ నిర్వహించారు. అది చిలకూరిపేటలో. ఆ తరువాత ఎవరి మానాన వారు ఉన్నారు. జనసేన ఇంకా ప్రచారం మొదలెట్టలేదు. పవన్ పిఠాపురానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. బీజేపీ అయితే ఇంకా సీట్ల పంచాయతీ దగ్గరే ఆగిపోయింది. మండు టెండలో చంద్రబాబు ఒక్కరే ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి ఎన్నికల ప్రణాళిక ఇంకా సిద్ధం చేయలేదు. మూడు పార్టీల నేతలతో కూటమి ప్రచారానికి వేగవంతం చేయాలనుకుంటే అది ఇంకా ఆలస్యం అయ్యేలా ఉంది. ఈలోగా వాలంటీర్ల వివాదం కూడా బూమరాంగ్ అయ్యేలా ఉంది. మరో వైపు చూస్తే వైసీపీలో అభ్యర్థుల మీద నిరసనలు వచ్చినా ఎక్కడా మార్చే ప్రసక్తి లేదని ఆ పార్టీ చెప్పేసింది. టీడీపీలో మాత్రం అభ్యర్థుల మార్పు కోసం అంతా ఒత్తిడి పెడుతున్నారు. ఇలాగైతే ఎప్పటికి కథ తెమిలేను అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా కూటమికి కష్టాలు అంతకంతకు పెరిగిపోతున్నాయని అంటున్నారు.

## వంద రోజుల్లో అట్టర్ ఫ్లాప్.. ఎంపీ అభ్యర్థి వినోద్..



కరీంనగర్,దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లోనే అట్టర్ ఫ్లాప్ అయిందని కరీంనగర్ బారాస అభ్యర్థి బోయిన్ పల్లి వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ లోని కిసాన్ నగర్ ప్రాంతంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో కలిసి మార్నింగ్ వాక్ లో పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీన రైతు రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా రైతులను మోసగిస్తూనే ఉన్నారన్నారు. బ్యాంకులు రైతులను రుణాలు కట్టాలని ఇబ్బందుల పాలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు పంట పెట్టుబడి కింద అందించే రైతు బంధు కూడా జమ చేయలేదని, కౌలు రైతులకు సహాయం ఊసే లేదన్నారు. 4వేల పింఛన్ అందిస్తామని మాట తప్పని, గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించారన్నారు. రైతులకు సాగునీరు అందించకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో హస్తం పార్టీకి చుక్కలు చూపించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. బిజెపి మతతత్వ పార్టీ అని, ఆ పార్టీ ఎంపీ బండి సంజయ్ గత ఐదేళ్లలో కరీంనగర్ ఏం చేశారన్నారు. నగర అభివృద్ధి తన హయాంలోనే జరిగిందని, స్మార్ట్ సిటీ పేరుతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపిలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నగర మేయర్ సునీల్ రావు స్థానిక కార్పొరేటర్లు ఎడ్ల సరిత - అశోక్,కంసాల శ్రీనివాస్, కుర్ర తిరుపతి నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ పలువురు డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తోంది...

తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ/ సీఎం కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆయన అస్వస్థతకు గురయ్యారని.. మార్చి 21న సీఎం కేజ్రీవాల్ అరెస్ట్ అయినప్పటి నుంచి ఈ రోజు వరకు 4.5 కిలోల బరువు తగ్గారని 'ఎక్స్ 'వేదికగా జలవనరుల శాఖ మంత్రి ఆతీశీ తెలిపారు.సీఎం అరవింద్ కేజ్రీవాల్ తీవ్రమైన మధుమేహం (డయాబెటిక్స్) కలిగి ఉన్నారు. ఆరోగ్య సమ్యలు ఉ?న్నపటికీ ఆయన దేశం కోసం రోజంతా పని చేస్తు న్నారు. అరెస్ట్ అయిన దగ్గరి నుంచి కేజ్రీవాల్ 4.5 కిలోల బరువు తగ్గారు. ఇ ది చాలా బాధ కలిగించే విషయం. బీజేపీ కావాలని కేజ్రీవాల్ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తోంది. కేజ్రీవాల్‌కు ఏమైనా అయితే దేశమే కాదు.. భగవంతుడు కూడా క్షమించడు'అని మంత్రి ఆతీశీ ఆవేదన వ్యక్తం చేశారు.అయితే తీహార్ జైలు అధికారు ఆతీశీ మాటలపై స్పందిస్తూ.. కేజ్రీవాల్ ఆరోగ్యం బాగానే ఉందని

## బీజాపూర్ ఎన్‌కౌంటర్.. 13కు చేరిన మృతుల సంఖ్య

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ మృతుల సంఖ్య 13కు పెరిగింది. జీజాపూర్ జిల్లాలోని కోర్చోలీ అడవుల్లో మంగళవారం ఉదయం ప్రారంభమైన ఎదురుకాల్పులు 10 గంటలపాటు కొనసాగిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 13 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయని అధికారులు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బీజాపూర్ జిల్లా అడవుల్లో మావోయిస్టులు ప్లీనరీ నిర్వహించనున్నట్టు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), సీఆర్పీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్(సీఏఎఫ్) భద్రతా బలగాలు గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవులను చుట్టుముట్టాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కోర్‌చోలీ సమీపంలోని లెంద్రా అడవుల్లో తారసపడిన మావోయిస్టు దళాలు జవాన్లపై కాల్పులకు దిగాయి. వెంటనే జవాన్లు అప్రమత్తమై ఎదురు కాల్పులు జరిపారు. రెండు గ్రూపుల మధ్య దాదాపు రెండు గంటల పాటు తుపాకుల మోత మోగింది. ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా బలగాలు ఘటనాస్థలిలో మొత్తం 13 మంది నక్సలైట్ల మృతదేహాలతో పాటు భారీయెత్తున ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సెర్చ్ ఆపరేషన్



కొనసాగుతున్నదని ఐజీ పీ సుందర్‌రాజ్ తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌లో డీవీసీ మెంబర్ క్రాంతి ముచతోపాటు మరో కీలక సభ్యుడు పాపారావు మృతిచెందినట్లు ప్రాథమిక సమాచారం అందింది. మావోయిస్టులు భారీ సంఖ్యలోనే గాయపడ్డట్లు భద్రతా దళాలు అంచనా వేస్తున్నాయి. కాగా, గత నెల 27న ఇదే బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సలైట్లు మరణించిన విషయం తెలిసిందే.

## సంపాదకీయం

గురువారం 04-04-2024

# బీజేపీ మేకపోతు గాంభీర్యం


రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సొంతంగా 370కి పైగా స్థానాల్లో గెలుస్తామని, కూటమి పార్టీలతో కలిపి 400 సీట్లు సాధిస్తామని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఊదరగొడుతున్నది. అయితే ఈ ప్రకటన కేవలం మేకపోతు గాంభీర్యంగానే కనిపిస్తున్నది. ఒకవేళ అదే నిజమైతే ఆ పార్టీ కుట్ర రాజకీయాలకు ఎందుకు తెరలేపినట్టు? కూటముల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నట్టు? పైకి గప్పాలు కొడుతున్నారే గానీ, బీజేపీ పాలకులకు కూడా ఓటమి భయం వెంటాడుతున్నది. ఎన్నికల వేళ విపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేస్తుండటమే అందుకు నిదర్శనం. %దీజీూ%ఎ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి సహా బీజేపీకి చెందిన హేమాహేమీలు ఎంతగా ప్రచారం చేసినా ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్‌ను అడ్డుకోలేకపోయారు. రోజురోజుకు బలపడుతూ పంజాబ్‌లోనూ అధికారం చేజిక్కించుకోవడమే కాకుండా పక్క రాష్ట్రాలకు ఆప్ విస్తరిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ దూకుడును కట్టడి చేసేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించినట్టు ఆరోపణలున్నాయి. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేయగా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్ సభ్యత్వం కూడా రద్దయింది. దీనంతటి వెనుక బీజేపీ వ్యూహం ఏమంటే మూడోసారి కూడా దేశంలో అధికారంలోకి రావడమే.కేవలం ప్రతిపక్ష నేతలపైనే విరుచుకుపడే దర్యాప్తు సంస్థలు.. అధికార పార్టీ నేతలపై అసలు కేసులే నమోదు చేయడం లేదు. ఒకవేళ నమోదైనా ఎలాంటి విచారణ జరగదు. ఇంకా విచిత్రం ఏమంటే ఎన్ని అవినీతి కేసులున్నా బీజేపీలో చేరిన వెంటనే అవి మాఫీ అవుతాయి. హిమంత బిశ్వశర్మ, సువేందు అధికారి, సుజనాచౌదరి, సీఎం రమేష్, గాలి జనార్దన్‌రెడ్డి, అజిత్ పవార్ ఇలా ఎందరో నేతలు కమలం తీర్థం పుచ్చుకొని పునీతులైనవారే.నాయకులే కాదు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలు నిర్వహించిన వెంటనే పలు కంపెనీలు కూడా బీజేపీకి దాసోహమవుతున్నాయి. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఆ పార్టీకి భారీగా నిధులు ఇచ్చి తమపై వచ్చిన ఆరోపణల నుంచి ఉపశమనం పొందుతున్నాయి. సీబీఐ, ఐటీ, ఈడీ లాంటి సంస్థలు కేసులు నమోదు చేసిన 41 కంపెనీలు రూ.2,471 కోట్లను బీజేపీకి విరాళంగా ఇచ్చిన విషయం ఎన్నికల బాండ్ల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఇదంతా నాణేనికి ఒకవైపు కాగా.. నాణేనికి మరోవైపు దేశంలోని చిన్నాచితకా పార్టీలను నయానో, భయానో లొంగదీసుకొని తనవైపు తిప్పుకొనేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. గత వైరాలను కూడా మర్చిపోయి పాత మిత్రులను బీజేపీ అక్కున చేర్చుకుంటున్నది. వాటితో పొత్తు కోసం వెంపర్లాడుతున్నది. అజిత్ పవార్‌పై ప్రధాని మోదీ అవినీతి ఆరోపణలు చేసిన కొద్ది రోజులకే ఆయన బీజేపీ కూటమిలో చేరిపోయారు. పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని గతంలో ఆరోపించి.. నేడు ఆ పార్టీతో కలిసి బీజేపీ ఏపీలో పోటీ చేస్తున్నది. బీహార్‌లో నితీశ్‌తో, యూపీలో చిన్న పార్టీలతో కమలం పొత్తు పెట్టుకున్నది.400 సీట్లు గెలిచే అవకాశం ఉన్నప్పుడు పార్టీలతో పొత్తులెందుకు? ఓవైపు ఎన్డీయే కూటమిలో కొత్త మిత్రులను కలుపుకొంటూనే.. ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేసే కుట్రలకు తెరలేపారు. తెలంగాణలో బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తు బెడిసికొట్టడానికి కమలం అధిష్ఠానమే కారణమని ఆరోపణలు వెల్లువెత్తాయి. రెండు పార్టీల మధ్య పొత్తు పొడవకుండా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై తీవ్రంగా ఒత్తిడి చేయడంతో ఆయన బీఎస్పీని వీడాల్సి వచ్చింది.యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఆ రాష్ట్రంలో గతంలో వచ్చినట్టు ఈసారి బీజేపీకి భారీగా ఎంపీ సీట్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మహారాష్ట్రలో పార్టీల చీలికలతో బీజేపీపై మరాఠాలు గుర్రుగా ఉన్నారు. అక్కడ కూడా గతంలో సాధించిన సీట్లను తిరిగి చేజిక్కించుకునే పరిస్థితుల్లేవు. పదేపదే కూటముల మార్పుతో నితీశ్ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో జరిగిన తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాలు గణనీయమైన ఓట్లు, సీట్లను సాధించాయి. గుజరాత్‌లో అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఇద్దరు పోటీ నుంచి తప్పుకొన్నారంటేనే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కేజ్రీవాల్ అరెస్టు ప్రభావం ఢిల్లీ, పంజాబ్ రాజకీయాలపై పడొచ్చు. ఇక దక్షిణాది సంగతికి వస్తే.. కర్ణాటకలో పరిస్థితులు కాస్త అనుకూలంగా ఉన్నా.. తెలంగాణలో గతంలో వచ్చిన సీట్లు గల్లంతయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. పైకి ప్రచారం చేస్తున్నట్టు.. దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవనే చెప్పాలి. అందుకే మరోసారి ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశంతోనే కూటములు కడుతూ, ప్రతిపక్ష పార్టీలను చీలుస్తూ, విపక్ష నేతలను అరెస్టు చేయిస్తూ అడ్డదారిలో వెళ్తుండటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.

# కరువుపై బిఆర్ఎస్ ఎన్నికల రాజకీయం !




హైదరాబాద్,పార్లమెంటు ఎన్నికల ప్రచారం ఇప్పుడు కరువు, రైతుల చుట్టూ తిరుగుతుంది.తెలంగాణలోని పలు జిల్లాల్లో కరువు కోరలు చాస్తోంది. చాలా ప్రాంతాల్లో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు అడుగంటుతుండటంతో పంటలపై ప్రభావం పడుతోంది. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ..విపక్ష బిఆర్ఎస్ ప్రచారం మొదలు పెట్టింది. ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సీరియస్‌గా దర్యాప్తు సాగుతోంది. అందులో కెసిఆర్, కెటిఆర్‌ల పేర్లు ఉన్నాయంటూ లీకులు వస్తున్నాయి. ఈ క్రమంలో తమ పాపాలను పక్కన పెట్టి ప్రజల దృష్టి మళ్లించడానికి, ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బిఆర్ఎస్ నానా తంటాలు పడుతోంది. తెలంగ్యాణలోనే కాదు..దేశం యావత్తూ కరువుతో అల్లాడుతోంది. కర్నాటకలో మంచినీటికి అల్లాడుతున్నారు. మేడిగడ్డ కుంగిపోవడంతో అందులో నీళ్లు నింపడానికి లేకుండా పోయింది. ఈ క్రమంలో కాళేశ్వరం అవినీతిపైనా, మేడిగడ్డ కుంగుబాటుపైనా విచారణ సాగుతోంది. దీనినుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కరువు కలిసి వచ్చిందన్న సంతోషంలో బిఆర్ఎస్ ఉంది. దీనికితోడు పార్టీలో ఉన్న నేతలు జంప్ అవుతున్నారు. టిక్కెట్ ఇచ్చినా మాకొద్దీ టిక్కెట్ అంటూ జారుకుంటున్నారు. ఈ స్థితిలో బిఆర్ఎస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. అందుకే పార్టీ మారిన వారిని చిల్లరగాళ్లు అంటూ విమర్శలు అందుకుంది. కరువు వస్తే నీళ్లు ఇవ్వడం లేదని, విద్యుత్ రావడం లేదనే పసలేని వాదనతో ప్రజల ముందుకు కెసిఆర్ ఆయన పరివారం బయలుదేరింది. ఇప్పుడు పంట చేతికి రావడంతో పాటు కొన్ని ప్రాంతాలలో పంటలు ఎండి పోయాయి. ఈఅంశాన్ని తెరపైకి తీసుకు వచ్చి కాంగ్రెస్‌కు అంటగట్టాలని బిఆర్ఎస్ నానా తంటాలు పడుతోంది. ఇప్పటికే ముఖ్యనేతలు ఎండిన పంటపొలాలను పరిశీలించారు. మాజీ సియం కెసిఅర్ మొన్నటికి మొన్న ఎండిన పంటపోలాలను పరిశీలించారు. అయితే నానా పాపాలు చేసిన బిఆర్ఎస్ తీరుపై అధికార పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తుంది.ఎందుకంటే ఇప్పటికే లోకసభ ఎన్నికల వేడి మొదలైంది.. నామినేషన్లకు గడువు రాకున్నా నేతలు తమ ప్రచార అస్త్రాలన్నీ బయటికి తీస్తున్నారు. ఇప్పుడు పలు ప్రాంతాలలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మరో పదిహేను రోజులలో పంటలు చేతికి రానున్నాయి. అయితే కండ్ల ముందే ఈ సమస్య ఉండడంతో దీనిపైనే బిఆర్ఎస్ నేతలు దృష్టి పెట్టాయి. దీనిని ఓ సమస్యగా చేస్తే రాజకీయ లబ్ధి పొందవచ్చున్న దురాలోచనలో ఆ పార్టీ ఉంది. బిజెపి ,బిఅర్ఎస్ పార్టీల నేతలు ఎండిన పంటపోలాలని పరిశీలించారు. ఈ రెండు పార్టీలు కూడా సాగునీటి సమస్యపై అందోళనలు నిర్వహించాయి. ఇప్పుడు రైతు సమస్యలపై మరింత ఫోకస్ పెట్టారు బిఅర్ఎస్ అధినేత, మాజీ సియం కెసిఅర్ ఎన్నికల వేళ క్షేత్రస్థాయిలో పరిశీలనకి వెళ్తున్నారు. తొలివిడత జనగామ, సూర్యాపేట పర్యటనలు ముగియడంతో.. ఈనెల 5న కరీంనగర్ లోక్‌సభ పరిధిలో వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎండిపోయిన పంటపోలాలను పరిశీలించ నున్నారు. ఈ రెండు పార్టీలు రైతుల సమస్యల అధారంగానే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. 10 రోజులలో వరి ధాన్యం ఐకెపి సెంటర్లకి రావడం, అమ్మడం లాంటి కార్యక్రమాలు కొనసాగుతాయి. అయితే అదనంగా క్వింటాల్‌కి రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈరెండు పార్టీలు గళం విప్పుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలకి ధీటుగానే అధికార పార్టీ సమాధానం చెబుతుంది. గత సంవత్సరం సరియైన వర్షాలు లేకపోవడం, వేగంగా ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గిపోవడం కారణంగా కరువు ఏర్పడిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల వేళా ప్రతిపక్ష పార్టీలు రైతు సమస్యలపైనా మాట్లాడుతున్నాయని చెబుతున్నారు. గత ప్రభుత్వం కారణంగానే రైతు సమస్యలు మరింత పెరిగాయని కాంగ్రెస్ నేతలు తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈ మూడు పార్టీలు రైతుల వైపే చూస్తున్నారు. అయితే రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఇటీవలే విమర్శించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్న కేసీఆర్.. ఇది వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని మండిపడ్డారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోవడానికి, కరెంటు లో వోల్టేజ్ సరఫరాకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేసీఆర్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటే ముందు ఎనిమిదేండ్లు తాము ఇవ్వగలిగినప్పుడు కరెంటు ఇప్పుడెట్ల మాయమైందని కేసీఆర్ ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మిషన్ భగీరథతో నీళ్లు అందించామని.. ఇప్పుడు మళ్లీ ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయని కేసీఆర్ ఆరోపించారు. ట్యాంకర్లు రావాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కరెంట్ వస్తూ పోతోంది కాబట్టే మోటార్లు కాలిపోతున్నాయన్నాయంటూ పేర్కొన్నారు. అసమర్థ కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటరిచ్చారు తెలంగాణ మంత్రులు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. పదేండ్లుగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే ప్రస్తుత పరిస్థితులకు కారణమన్నారు. అధికార, విపక్ష నేతల విమర్శలెలా ఉన్నా ప్రస్తుతం తెలంగాణలో భూగర్భజల మట్టం రోజురోజుకీ దిగజారుతూ గతేడాది కంటే మరింత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి విరుగుడు కనిపెట్టాలి. వాననీటిని ఒడిసి పట్టే చర్యలకు పూనుకోవాలి. చెరువును పూడికతీసి పునరుద్దరించాలి. మిషన్ భగీరథ పేరుతో చెరువుల పూడికతీత పనులు ఉత్తిదే అని తేలింది. అది విచారించి దానిని తిరిగి చేపట్టాలి. శ్రీరాంసాగర్‌లో నీటిమట్టం పూర్తిగా తగ్గినందున పూడికత ఎత్తే పనిచేయాలి. దీనివల్ల వచ్చే వర్షాకాలంలో నీటి నిల్వలు పెంచుకునే అవకాశం ఉంటుంది. ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎండాకాలం పనులకు పూనుకోవాలి.

# చట్టసభల్లో రైతు ప్రాతినిధ్యమేది?



న్యూఢిల్లీ,భారతీయుల ప్రధాన వృత్తి వ్యవసాయం. దేశ జనాభాలో సుమారు 60% మంది వ్యవసాయం లేదా దాని అనుబంధ పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు. అయితే ప్రభుత్వ పాలనా పరంగా అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న రంగం కూడా అదే. వ్యవసాయాన్ని, రైతుల ఆర్థిక పరిస్థితులను ఒక పరిపూర్ణ ప్రణాళిక ద్వారా మెరుగుపరచకుండా క్షతగాత్రుడికి బ్యాండేజి కట్లు కట్టినట్లు అరకొర పథకాలతో ఎన్నికల్ని దాటేందుకు మాత్రమే ప్రతి ప్రభుత్వం ఆలోచిస్తోంది. రైతులకు అవసరమైన విత్తనాల, ఎరువుల ధరలు పెరగని సంవత్సరం లేదు. నకిలీ మందుల బెడద తీర్చేవారు లేరు. మద్దతు ధర కాగితాలకే పరిమితం. నకిలీ విత్తనాలు, పెస్టిసైడ్స్ అమ్మే, పంటను కొనే వ్యాపారుల చేతుల్లో రైతులు నిండా మునుగుతున్నారు.ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా అమాయక రైతులకు వాటి ప్రయోజనం దక్కడం లేదు. వ్యవసాయం శాఖ నుండి ఎలాంటి శిక్షణ, రక్షణ లేక దిక్కులేని పరిస్థితుల్లో బతుకుతున్నారు. దీనికి ప్రధాన కారణం చట్ట సభల్లో రైతు ప్రతినిధులకు తగిన స్థానం లేకపోవడమే అనుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోంచి వచ్చిన అగ్ర వర్ణాల నేతలందరూ తాము రైతులమే అని చెప్పుకుంటారు. కానీ వారంతా వందల ఎకరాల భూస్వాములే తప్ప సాగు కష్టనష్టాలను ఎదుర్కొంటున్న రైతులు కాదు. ఇంకా చెప్పాలంటే భూమికి యజమానులై వేలాది కౌలు రైతుల ఉసురు పోసుకుంటున్నవారని కూడా చెప్పవచ్చు. భూమి ఉన్నందుకు రైతుబంధు తీసుకుంటున్నాం, అందులో తప్పేంటి అని నిర్లజ్జగా వాదించే నాయకులను మనం చూస్తున్నాం. తెర వెనుక కౌలు రైతుల అరగోసకు తామే కారణమని తెలిసీ దాస్తున్న సత్యమిది. అందరూ రైతు కుటుంబం నుంచి వచ్చామని చెప్పుకున్నా నాగలి పడుతున్నవారు మాత్రం కాదు.వ్యవసాయిక కుటుంబాల్లోంచి వచ్చిన రాజకీయ నాయకులంతా కాంట్రాక్టుల్లో, రియల్ ఎస్టేట్ దందాల్లో, వ్యాపారాల్లో, న్యాయవాద వృత్తిలో స్థిరపడి భారీగా ఆదాయాన్ని పొందుతున్నవారే. వారిని రైతు ప్రతినిధిగా లెక్కించలేము. రైతుల కోసం ఉద్యమాలు చేపట్టేవారు, చట్ట సభల్లో వారి సమస్యలపై గట్టిగా ప్రశ్నించేవారు మాత్రమే రైతు ప్రతినిధులుగా పరిగణింపబడతారు. ఈ రోజుల్లో ఏ పార్టీ తరపున గెలిచినా చట్ట సభల్లో రైతుల పక్షాన గట్టిగా గొంతెత్తేవారు, ప్రభుత్వ నిర్ణయాలను నిలదీసేవారు, నిరసన తెలిపేవారు పూర్తిగా కరువయ్యారు. అందుకే దేశంలో రైతు బతుకు కేవలం వ్యాపారవేత్తల లాభాలకు బలవుతోంది. పార్టీకి ఆర్థికంగా సాయపడేవారి కోరిక మేరకు బడ్జెట్ తయారు చేయడంతో పాటు, చట్టసభల్లో ఉన్న సభ్యులకు సాగు బాధలు స్వయంగా తెలియకపోవడం వల్ల వారి పట్ల తేలికభావం ఏర్పడింది. పైగా ఉన్నత వర్గాలకు చెందిన వారికి శ్రమ జీవులపై సానుభూతి ఉండకపోవడంతో పేదల అవసరాల పట్ల వారికి నిరాసక్తి ఉంటుంది.అందుకే చట్టసభల్లో రైతు కష్టాలను తెలపడానికి అందులో సభ్యులుగా రైతులు లేదా రైతు ఉద్యమ నేతలు ఉండాలి. అయితే ఈ రోజుల్లో ఏ పార్టీ వారికి టికెట్ ఇచ్చే ఆలోచనలో లేదు. వారు స్వయంగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే పరిస్థితులు లేవు. జంప్ జిలానీలకు టికెట్లు సర్దే విషయంలో తలమునకలైన పాలక పార్టీలకు కనీసం ఒకరిద్దరినైనా రైతుల పక్షాన సభలో కూచోబెడదామన్న ఇంగితం లేదు. రాజ్యసభ, విధానమండలి కూడా పార్టీలని మేపేవారితోనే నింపుతున్నారు. పార్టీల మారడం కూడా సంఘసేవ అని చెప్పుకొనే స్థాయిలో మనవాళ్లున్నారు. ప్రస్తుత తెలంగాణ విధాన మండలిలో ఒక్క రైతు ప్రతినిధి కానరాడు. జనాభాలో సగం మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయం తరపున చట్టసభల్లో కనీసం 10 శాతమైనా లేకపోవడం మన దౌర్భాగ్యం.ఒకప్పుడు రైతుల సమస్యలపై అవగాహన కలవారిని వ్యవసాయశాఖ మంత్రిగా ఎంపిక చేసేవారు. సుదీర్ఘ రాజకీయ జీవితం గల వడ్డే శోభనాద్రీశ్వరరావు వ్యవసాయం మంత్రిగా సభలో రైతుల గురించి పక్షపాతం లేకుండా మాట్లాడేవారు. కోనేరు రంగా రావు పేదలకు భూపంపిణీ విషయంలో ఆనాటి ప్రభుత్వానికి విధివిధానాలు రూపొందించి అందించారు. రైతు నేపథ్యం గల జువ్వాడి చొక్కా రావు తెలంగాణలో సాగు, తాగు నీటి పారుదల సౌకర్యాలకై ఎంతో కృషి చేశారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఆయన పేరు పెట్టారు. వ్యవసాయ మంత్రిగా పని చేసిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యవసాయంలో డాక్టరేట్ చేసి పాఠాలు కూడా చెప్పా రు. చట్ట సభ్యుడిగా ఆయన ఎన్నో వ్యవసాయ సంస్కరణల కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. యలమంచిలి శివాజీ రాజ్యసభలో, బయటా రైతు శ్రేయోభిలాషిగా కృషి చేశారు. వ్యవసాయ పద్ధతులపై సాధికారిత గల రైతునేత ఆయన.గత పదేళ్లుగా పార్లమెంట్‌లో రైతు నేపథ్య ప్రజా ప్రతినిధుల సంఖ్య తగ్గిపోతోంది.వందకు పైగా గ్రామీణ జీవితాల్లోంచి వచ్చిన సభ్యులు ఉండే లోక్‌సభలో ఇప్పుడు కేవలం 38 మంది మాత్రమే వ్యవసాయం కుటుంబాల్లోంచి వచ్చినవారున్నారు. 40 % సభ్యులు తమ అఫిడవిట్‌లో సాగు భూమి కలిగి ఉన్నా అది కేవలం స్థిరాస్తిగానే లెక్కించాలి. మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ నికార్సయిన రైతు పక్షపాతి. నెహ్రూ ప్రతిపాదించిన సామూహిక వ్యవసాయ పద్ధతిని ఆయన వ్యతిరేకించి రైతుకు భూమిపై హక్కు ఉండాలని కృషి చేశారు. ఆయన సమాధిని కిసాన్ ఘాట్ అని పిలుస్తారు. ఆయన జన్మదినాన్ని కిసాన్ దివస్‌గా ప్రకటించారు. దేవీలాల్, అజిత్ సింగ్ కూడా వ్యవసాయ శాఖా మంత్రులుగా తమ ముద్ర వేశారు. అయితే వీరితో పోల్చదగ్గ నేతలెవరూ ప్రస్తుతం చట్టసభల్లో లేరు. రైతు పక్షాన నిలబడాలనే నిబద్ధత పూర్తిగా లోపించింది. ప్రస్తుతం రైతుల సంస్థలపై ఉద్యమిస్తున్న వారెవరూ ఎన్నికల్లో నిలబడి గెలిచే అవకాశం లేదు. వారిని ఏ పార్టీ కూడా తమ అభ్యర్థులు ప్రకటించేందుకు సిద్ధంగా లేవు.యుపిలో రైతుల కరెంటు బిల్లు, నీటి బిల్లు తగ్గించాలని పోరాడిన దివంగత రైతు నాయకుడు మహేంద్ర సింగ్ టికాయత్ రెండు పర్యాయాలు అసెంబ్లీకి పోటీ చేసినా గెలుపు ఆయన్ని వరించలేదు. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకొనేలా కేంద్రం మెడలు వంచిన రైతు నేత రాకేష్ టికాయత్ 2007లో అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. హక్కులనేత యోగేంద్ర యాదవ్ కూడా ఆప్ తరపున 2014 లో పార్లమెంటుకు పోటీచేసి గెలవలేకపోయారు. ఇలా నేటి ఎన్నికల పర్వంలో రైతు నేతలు నెగ్గుకు రాలేకపోతున్నారు. పార్టీలు నిజమైన రైతు పక్షపాతులకు టికెట్ ఇవ్వకపోవడం, నిలబడ్డవారిని జనం గెలిపించుకోకపోవడం వల్ల చివరకు రైతుల గురించి చట్టసభల్లో ప్రశ్నించేవారు లేకుండా పోతోంది.

## సముద్రంలో ఆరుగురు మత్స్యకారుల గల్లంతు

విశాఖపట్నం,విశాఖపట్నం సముద్రంలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కం గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు సోమవారం సాయంత్రం విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి దక్షిణ దిశగా గంగవరం వైపు చేపల వేటకు వెళ్లారు.

# జనసేనలో చేరిన నిమ్మక జయకృష్ణ

శ్రీకాకుళం,ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత నిమ్మక జయకృష్ణ పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.పాలకొండ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి 2014, 2019లో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మరోసా ఈ ఎన్నికల్లో ముచ్చటగా మూడవసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని తహతహ లాడుతున్నారు. అటు కూటమి వైపు మాత్రం అభ్యర్థి ఎవరు అనేదే ఇంకా తేలలేదు. పాలకొండ నియోజకవర్గంలో ముందు నుంచి టిడిపి వర్సెస్ వైకాపా మధ్య ప్రధాన పోరు కొనసాగుతూ వచ్చింది. అదే సమయంలో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే నిమ్మక గోపాలరావు చరిష్మాతో రాజకీయాల్లోకి వచ్చిన జయకృష్ణకు స్వపక్షంలో విపక్షంలా సొంత పార్టీ నాయకుల అసమ్మతి పోరు నెలకొంది. జయకృష్ణ నాయకత్వాన్ని కాదంటూ పార్టీలోని ఓ వర్గం సామాజిక కార్యకర్తగా ఉన్న పడాల భూదేవిని ప్రోత్సహిస్తూ వచ్చింది. టీడీపీ టికెట్‌ను ఆశిస్తూ భూదేవి నియోజకవర్గంలో జయకృష్ణకి పోటీగా పర్యటిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. ఈ క్రమంలో సీటు జనసేన ఖాతాలోకి వెళ్లింది. జనసేనకు బలమైన అభ్యర్థి కొరత ఉండటంతో నిమ్మక జయకృష్ణ పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపి ఆ పార్టీలోకి చేరిపోయారు. టిక్కెట్ ఆయనకే ఖరారు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ అంశంపై పవన్ కల్యాణ్ సర్వే నిర్వహింపచేసినట్లుగా తెలుస్తోంది. పవన్ సమక్షంలో జనసేనలో చేరానని.. పాలకొండ నుంచి జనసేన తరపున పోటీ చేస్తానని వెల్లడించారు. ఈ విషయంలో పవన్ సానుకూలంగా ఉన్నారన్నారు. పాలకొండ ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ కలిసి నియోజకవర్గాన్ని దోచేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరిని కూటమి తరపున తరిమి కొడతామన్నారు నిమ్మక జయకృష్ణ. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల పొత్తులో భాగంగా అవనిగడ్డ, పాలకొండ స్థానాలు జనసేన పార్టీకి వెళ్లాయి. దీంతో గతంలో ఇక్కడి నుంచి టీడీపీ తరుపున పోటీ చేసిన మండలి బుద్ధప్రసాద్, నిమ్మక జయకృష్ణకు నిరాశ ఎదురైంది. దీంతో టీడీపీకి గుడ్ బై చెప్పిన ఇద్దరు నేతలు జనసేన కండువా కప్పుకున్నారు. అవనిగడ్డ, పాలకొండ స్థానాలలో పలువురు పేర్లతో జనసేన సర్వేలు చేయించింది. 21 స్థానాల్లోనూ కచ్చితంగా గెలవాలని పట్టుదలగా ఉన్న పవన్ కల్యాణ్ టీడీపీ నేతలకే అవకాశం కల్పిస్తున్నారు.

# కేజ్రీవాల్ అభ్యర్థనలకు ఆమోదం..

న్యూఢిల్లీ,ఢిల్లీ మద్యం కేసు లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు స్థానిక రౌస్ అవెన్యూ కోర్టు ఈనెల 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన్ని తీహార్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో జైల్లో చదువుకోవడానికి పుస్తకాలు, ఇంటి భోజనం, మందులు అనుమతించాలంటూ కేజ్రీ చేసిన అభ్యర్థనలకు కోర్టు ఆమోదం తెలిపింది.కేజ్రీ అభ్యర్థన మేరకు భగవద్గీత, రామాయణం, హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్ పుస్తకాలను అనుమతించాలని అధికారులను కోర్టు ఆదేశించింది. వీటితోపాటు తన ఆరోగ్యం దృష్ట్యా ఇంట్లో వండిన భోజనం, వాటర్ బాటిల్స్, మందులను అనుమతించింది. జైల్లో ఉన్న సమయంలో సడెన్‌గా బ్లడ్ షుగర్ లెవల్స్ పడిపోతే వాడేందుకు షుగర్ చాక్లెట్స్ ఇంటి నుంచే పరుపులు, దిండ్లు, వైద్యులు సూచించిన విధంగా ఒక టేబుల్, కుర్చీ వంటి వస్తువులను కూడా అనుమతించింది.వీటితోపాటు మతపరమైన లాకెట్ ధరించేందుకు కేజ్రీ పెట్టిన అభ్యర్థనకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జైలు నిబంధనల ప్రకారం వస్తువులన్నింటినీ జైలు అధికారులు తరచూ పరిశీలిస్తుంటారని కోర్టు తెలిపింది. జైల్లో ఉన్న సమయంలో కేజ్రీ తన భార్య సునీతను కూడా కలుసుకోవచ్చని కోర్టు తెలిపింది. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ బీపీ, షుగర్ లెవల్స్‌ను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది.

జైల్లో కేజ్రీ దినచర్య

కాగా కేజ్రీవాల్‌ను తీహార్ జైలులోని నంబర్ 2 జైలులో ఉంచారు. ఇక్కడ 24 గంటలపాటు సీసీటీవీ నిఘా ఉంటుంది. 24/7 వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఆయన షుగర్ వ్యాధితో బాధపడుతున్నందున రెగ్యులర్ చెకప్‌లు చేయనున్నారు. ఇక జైల్లో మిగిలిన ఖైదీల మాదిరిగానే కేజ్రీవాల్ దినచర్య ఉదయం 6.30 గంటలకే రోజు ప్రారంభం కానుంది. అల్పాహారంలో భాగంగా ఆయనకు టీ, కొన్ని రొట్టెముక్కలు (బ్రెడ్ స్లైసెస్) ఇవ్వనున్నారు. అనంతరం కోర్టు విచారణ ఉంటే ఆయన్ని తీసుకెళ్తారు. లేదంటే కేజ్రీవాల్ తన న్యాయబృందంతో సమావేశమయ్యేందుకు అనుమతి ఉంది. ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య భోజనం ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 వరకూ సీఎం తన జైలు గదిలోనే ఉండాల్సి ఉంటుంది. ఆ సమయంలో లాకప్‌కు తాళం వేస్తారు. ఖైదీలందరినీ లాకప్‌లోనే ఉంచుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఒక కప్పు టీ, రెండు బిస్కట్లు ఇస్తారు. సాయంత్రం 4 గంటలకు మళ్లీ తన లాయర్లతో సమావేశం అవ్వొచ్చు. సాయంత్రం 5.30 గంటలకే రాత్రి భోజనం అందిస్తారు. అనంతరం 7 గంటలకల్లా మళ్లీ సెల్‌లోకి పంపిస్తారు. జైల్లో కేజ్రీవాల్‌కు టీవీ చూసే సదుపాయం కూడా ఉంది.

ఆప్ నేతలంతా తీహార్ జైల్లోనే..

మరోవైపు మద్యం కుంభకోణం కేసులో జైలుకు వెళ్లిన ఆప్ నేతల్లో కేజ్రీవాల్ నాలుగో వ్యక్తి కావడం గమనార్హం. అంతకుముందు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా. మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలు పలు కేసుల్లో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వాళ్లు కూడా ప్రస్తుతం తీహార్ జైలులోనే ఉన్న విషయం తెలిసిందే.

ఆయనే సీఎంగా కొనసాగుతారు: ఆప్

కేజ్రీవాల్‌ను ఎంతకాలం జైల్లో ఉంచినప్పటికీ, ఢిల్లీ సీఎంగా ఆయనే కొనసాగుతారని ఆప్ నేత జాస్మిన్ షా పేర్కొన్నారు. సీఎంగా ఢిల్లీ ప్రజలకు సేవ చేసేందుకు ఆయన రాజ్యాంగబద్ధంగా ప్రమాణస్వీకారం చేశారని, అది ఆయన బాధ్యత అని అన్నారు. జాస్మిన్ షా సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మద్యం పాలసీ కేసులో ఆతిశీ,భరద్వాజ్ పేర్లను తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్‌ను ఖతం చేయాలంటే కేజ్రీవాల్‌ను మాత్రమే జైలుకు పంపిస్తే సరిపోదని బీజేపీ భావిస్తున్నదని ఆరోపించారు.మరోవైపు రానున్న రోజుల్లో పార్టీలో కేజ్రీవాల్ భార్య సునీత కీలక పాత్ర పోషించనున్నారని ఆప్ వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం..

వరంగల్,నాపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తాను శాయసక్తుల కృషి చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గం ఐదవ డివిజన్ లోని దాసరి వాడ ప్రాంతంలో డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభు త్వం మాదిరిగా మాటలు చెప్పడం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నదని తెలిపారు. నియోజకవర్గ సమస్యలను త్వరితగతిన తీర్చేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవం

హైదరాబాద్, 2008 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2 వ తేదీన ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఆటిజమ్ పై 18 డిసెంబర్ 2007 న ఆమోదించిన ఒక తీర్మానం ద్వారా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. ఈ వ్యాధితో బాధపడే పెద్దలు,ప్రత్యేక అవసరాలు గల పిల్లల జీవితాలను మెరుగు పరచి, వారికి తోడ్పాటును అందించడం కోసం ఈ తీర్మానాన్ని ఆమోదించారు. ఆటిజమ్ అంటే.. కొందరు పిల్లలు ఎవరితోనూ కలవకపోవటం, ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతుండటం, సరిగా మాట్లాడలేకపోతుండటం వంటి భిన్న లక్షణాలను కలిగి ఉంటే వారికి ఆటిజమ్ ఉన్నట్లు. ఆటిజమ్ భిన్న విభాగాలకు విస్తరించిన ఎదుగుల సమస్య. దీన్నే పర్వేసివ్ డెవలప్మెంటల్ డిసార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కనబడతాయి. కొన్ని అంశాల్లో.. ఎదుగుదల అస్తవ్యస్త మవుతుంది.గుర్తించేదెలా. మరీ చిన్నవయసులో.. అకారణంగా నిరంతరంగా ఏడ్వటం గంటల తరబడి స్తబ్దుగా ఉండటం. తల్లి దగ్గరకు తీసుకుంటున్నా పెద్దగా స్పందించకపోవటం.. పరిచిత వ్యక్తులను చూడగానే నవ్వక పోవటం? తల్లిదండ్రులు రమ్మని చేతులు చాచగానే ఉత్సాహంగా ముందుకు రావాల్సిన పిల్లల్లో అలాంటి స్పందనలేవీ కనిపించకపోవటంకాస్త పెద్దవయసులో..? మిగతా పిల్లలతో కలవకపోవటం పిలిస్తే పలకకపోతుండటం.. పెరిగే కొద్దీ ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడుతుండటం..మనుషుల కంటే బొమ్మలు, వస్తువుల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండటం ఎవరైనా పలకరించినా వెంటనే సమాధానం ఇవ్వకపోవటం? కళ్లలో కళ్లు పెట్టి చూడకపోతుండటం.. ముఖంలో భావోద్వేగాలేవీ చూపించకపోతుండటం స్పీచ్ థెరపీ, లాంగ్వేజ్ స్టిమ్యులేషన్:? ఒక పద్ధతి ప్రకారం ఉదయం నుంచి రాత్రి వరకూ పిల్లలతో మాట్లాడుతుండటం, సంభాషణా సామర్థ్యం పెరిగేలా చూడటం అవసరం. దీనికి స్పీచ్ థెరపీ దోహదం చేస్తుంది. కళ్లలో కళ్లు పెట్టి చూడటాన్ని అలవాటు చేసేందుకు శిక్షణ, అలాగే మలమూత్ర విసర్జన కోసం టాయ్ లెట్ ట్రైనింగ్ వంటివన్నీ పద్ధతి ప్రకారం నేర్పిస్తారు. క్రమేపీ స్థాయిలను పెంచుకుంటూ వెళతారు. దీంతో మెదడులో లోపం క్రమేపీ సర్దుకుంటుంటుంది.

# విజయంపై కన్నేసిన గద్దె

విజయవాడ,:విజయవాడలోని తూర్పు నియోజకవర్గం ఇప్పుడు మరోమారు చర్చగా మారింది. గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పట్టు సాధించింది. ప్రస్తుతం ఆ పార్టీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రెండోసారి ఎమ్మెల్యేగా ఇక్కడ నుంచే కొనసాగుతున్నారు. హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన గద్దెరామ్మోహన్.... మరోసారి విజయవాడ తూర్పు నుంచే తెలుగుదేశం పార్టీ తరఫున పోటీలో ఉండగా... .తెలుగుదేశం నుంచి వైసీపీలో చేరిన మాజీమంత్రి దేవినేని నెహ్రూ కుమారుడు దేవినేని అవినాష్ ఈసారి ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ పడుతున్నారు. గతంలో అవినాష్ తండ్రీ ఐదుసార్లు ఇదే ప్రాంతం నుంచి గెలిపొంది ఉండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా దేవినేనికి అనుచరులు ఉండటంతో గెలుపై ఆయన దీమాగా ఉండగా.... రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని గద్దె రామ్మోహన్ చెబుతున్నారు. దీన్ని 1967 నియోజకవర్గాల పునర్విభజన చట్టం ప్రకారం ఏర్పాటు చేశారు. విజయవాడ నగరపాలక సంస్థలోని వార్డులతోపాటు అర్బన్ ప్రాంతం ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. విజయవాడ తూర్పు నియోజకవర్గం 1967లో ఏర్పాటు చేసినా 2007లో జరిగిన పునర్విభజనలో పేరు మాత్రం అలాగే ఉంచి...నియోజకవర్గ స్వరూపం మొత్తం మార్చేశారు. గతంలో కంకిపాడు నియోజకవర్గం లో ఉన్న ప్రాంతాలన్నింటినీ ఇప్పుడు విజయవాడ తూర్పులో కలిపేశారు. విజయవాడలోని అత్యంత కీలమైన బందర్‌రోడ్డు, ఆటోనగర్, మేజర్ కాలనీలు , హెల్త్ యూనివర్సిటీలు, కీలకమైన కళాశాలు ఉన్నాయి. 1967లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున నిల్చున్న తెన్నేటి వి.ఎస్.సి.ఆర్ గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఈ సీటు నిలబెట్టుకుంది. 1972లో జరిగిన ఎన్నికల్లో దమ్మాలపాటి రామారావు గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ హ్యాట్రిక్ విజయం సాధించింది. ఆ పార్టీ తరపున పోటీ చేసిన మాజీముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ గాలి వీచింది. 1983లో జరిగిన ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి అడుసుమిల్లి జయప్రకాశ్‌రావు జయకేతనం ఎగురవేశారు. ఆ తర్వాత విజయవాడలో వరుస హత్యలు, తదనంతర పరిణామాలతో కాంగ్రెస్ పార్టీలో చేరిన వంగవీటి రంగాకు 1985లో విజయవాడ తూర్పు టిక్కెట్ కేటాయించింది. ఆ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందగా....ప్రత్యర్థుల దాడిలో ఆయన హత్యకు గురయ్యారు. అనంతరం 1989లో జరిగిన ఎన్నికల్లో రంగా భార్య రత్నకుమారికి కాంగ్రెస్ టిక్కెట్ కేటాయించగా...ఆమె విజయం సాధించారు. 1994లో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం గాలి వీచినా....విజయవాడ తూర్పులో మాత్రం మరోసారి వంగవీటి రత్నకుమారి కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఈ సీటును తెలుగుదేశం పార్టీ బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీ నుంచి సినీనటుడు కోట శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో జరిగిన ఎన్నికల్లో వంగవీటి రంగా కుమారుడు రాధాకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కేటాయించింది. ఈ ఎన్నికల్లో ఆయన విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఇదే నియోజకవర్గం నుంచి ఆయన తండ్రీ, తల్లీ, కుమారుడు ముగ్గురు విజయం సాధించడం విశేషం. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కంకిపాడు రద్దవ్వడం...ఆ నియోజకవర్గంలోని చాలా ప్రాంత విజయవాడ తూర్పులో కలవడంతో కాంగ్రెస్‌లో చేరిన దేవినేని నెహ్రూ విజయవాడ తూర్పు టిక్కెట్ దక్కించుకున్నారు . తెలుగుదేశం నుంచి గ్దదెరామ్మోహన్ బరిలో దిగగా... ప్రజారాజ్యం నుంచి టిక్కెట్ సాధించిన యలమంచలి రవి కేవలం 190 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి మరోసారి గ్దదె రామ్మోహన్ పోటీ చేసి వైసీపీ అభ్యర్థి వంగవీటి రాధాపై విజయం సాధించారు. 2019 జరిగిన ఎన్నికల్లో రెండోసారి గ్దదెరామ్మోహన్ విజయవాడ తూర్పు నుంచి గెలుపొందారు. వంగవీటి రాధా తెలుగుదేశంలో చేరగా...వైసీపీ టిక్కెట్ బొప్పన భవకుమార్ దక్కించుకున్నారు.

## ఎపిలో స్కూళ్లకు 24 నుంచి వేసవి సెలవులు

అమరావతి,ఏపీలో ఎండలు మండుతున్నాయి. దీంతో ఏపీ ప్రభుత్వం స్కూళ్లకు వేసవి సెలవులు ప్రకటించేసింది. ఏప్రిల్ 24 నుంచి పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానున్నాయి. జూన్ 13 వరకూ అంటే 50 రోజుల పాటు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. మార్చి 18 నుంచి ఏపీ ప్రభుత్వం ఎండల కారణంగా ఒంటిపూట బడులను ప్రకటించింది. అప్పటి నుంచి ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒంటిపూట ఒడులు నిర్వహిస్తున్నారు. కాగా.. ఏపీ వ్యాప్తంగా ఏప్రిల్ 23 నాటికి అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు పూర్తి చేసి.. 24 నుంచి వేసవి సెలవులు ఇవ్వనున్నారు.

# జెఎన్‌యు గుణ‘పాఠం’

ప్రస్తుత ఎన్నికల్లో 400కు పైగా లోక్‌సభ సీట్లు గెలుచుకుని రికార్డు సృష్టిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ నిత్యం ప్రచారం చేస్తున్నా క్షేత్ర స్థాయి వాస్తవాలు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. నాలుగైదు సీట్లకు మించి ప్రభావం లేని పార్టీలతో సైతం పొత్తు కోసం ఆరాటపడుతూ ఉండటం గమనిస్తే ఈ ఎన్నికల్లో ప్రతి సీటు కూడా ఎంతో విలువైనది అన్నట్లుగా వ్యవహరించడం కనిపిస్తున్నది. పలు జాతీయ సంస్థలు నిర్వహించిన సర్వేలలో ముఖ్యంగా ఉపాధి అవకాశాలు సన్నగిల్లిపోవడం పట్ల, అత్యధిక ప్రజల ఆదాయాలు పడిపోతూ ఉండటం పట్ల, ధనిక పేదల మధ్య అగాధం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోతూ ఉండటం పట్ల ప్రజలలో తీవ్ర నిరాశా నిస్పృహలు నెలకొన్నట్లు స్పష్టం అవుతుంది.అయినప్పటికీ తిరిగి మోడీ మరోసారి ప్రధాని కాగలరని ప్రతిపక్ష నేతలు సైతం పరోక్షంగా అంగీకరిస్తుండటం కనిపిస్తున్నది. ‘ఇండియా నుండి భారత్’ యాత్రను గత రెండు నెలలుగా జరుపుతూ దేశ వ్యాప్తంగా ప్రజల నాడి తెలుసుకోవడం కోసం పర్యటిస్తున్న ప్రముఖ జర్నలిస్టు, రచయిత, సి ఓటర్ కార్యనిర్వాహక డైరెక్టర్ సుతాను గురు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ఈ విషయమై ఆసక్తికర అంశాలు తెలిపారు. ప్రతిపక్షాల బలహీనతలే అందుకు ప్రధాన కారణంగా స్పష్టం చేశారు. ప్రజలు మోడీ పాలన పట్ల అసంతృప్తితో ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు వారి విశ్వాసం పొందే ప్రయత్నాలు చేయలేకపోతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ప్రతికూల అంశాలు, ప్రభుత్వ వైఫల్యాలను మాత్రమే పట్టుకొని వేలాడుతూ ప్రజలలో ఓ సానుకూల భరోసా కల్పించే ప్రయత్నం చేయలేకపోతున్నాయని, మరోవంక ప్రధాని మోడీ భవిష్యత్తు పట్ల అందమైన కలలను ప్రజల ముందుంచగలుగుతున్నారని పేర్కొన్నారు.మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చేస్తామనో, 2047 నాటికి ‘వికసిత భారత్’గా మలుస్తామనో సాధారణ ప్రజల దైనందిన జీవితాలపై ఎటువంటి ప్రభావం చూపలేని అంశాలను అందంగా ముందుంచుతున్నారని గుర్తు చేశారు.దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాల్లో పలు ప్రభుత్వాలు విజయవంతంగా అమలు పరుస్తున్న పలు సంక్షేమ పథకాలను మొదటిసారిగా ఉత్తరాది రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు పరచడం కూడా ఉత్తరాది రాష్ట్రాల్లో బిజెపి ప్రభంజనానికి కారణమని తెలిపారు. అయితే దక్షిణాదిన అటువంటి పథకాలు కొత్తవి కాకపోవడం తో ఇక్కడ బిజెపి తగు ప్రభావం చూపలేకపోతున్నట్లు చెప్పారు. కాంగ్రెసేతర పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఉత్తర ప్రదేశ్ మినహాయించి మరెక్కడా బిజెపి ఆధిపత్యం పొందలేకపోతున్నది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాలలో బిజెపి ఎదిగే ప్రయత్నాలు ఫలించడం లేదు. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బిజెపి బలమైన పక్షంగా ఎదిగినా కాంగ్రెస్, సిపిఎం లను మట్టికరిపించి ఆ స్థాయికి చేరుకోగలిగింది.కానీ అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌ను మాత్రం దెబ్బకొట్టలేకపోతున్నది. అందుకనే తెలంగాణ, కర్నాటక వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌పై కన్నా ప్రాంతీయంగా బలంగా ఉన్న బిఆర్ఎస్, జెడిఎస్‌లను ఉనికి కోల్పోయే విధంగా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నది. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో బిజెపి ఎంతగా బలం పుంజుకొంటున్నా సీట్లు గెల్చుకొనే పరిస్థితి కనిపించడం లేదు. తమిళనాడులో బిజెపి రెండంకెల శాతం ఓట్లు పొందనున్నట్లు వస్తున్న కథనాలను ప్రస్తావిస్తూ అదంతా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అణ్ణామలైను ఓ గొప్ప నాయకుడిగా మీడియా చేస్తున్న సృష్టి ఫలితమే అని సుతాను గురు స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నట్లు తెలిపారు. దేశంలో బిజెపి పాలనపట్ల ప్రజలలో వ్యతిరేకత పెరిగితే సగానికి పైగా సీట్లలో బలమైన ప్రత్యర్థిగా ఉన్న తాము పెద్ద ప్రయత్నం చేయకుండానే అధికారంలోకి వస్తామనే మితిమీరిన ధీమాతో తప్పులమీద తప్పులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్నది.ముఖ్యంగా పార్టీలో ఎటువంటి అధికార హోదా లేకుండా రాహుల్ గాంధీ ‘వీటో పవర్’ అనుభవించడాన్ని ప్రజలు హర్షించలేకపోతున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిపినా తమ కీలు బొమ్మగా వ్యవహరించే నేతను ఎన్నుకోవడం ద్వారా సంస్థాగతంగా పార్టీ క్రియాశీలం కాకుండా అడ్డుకొన్నట్లయింది. అధ్యక్ష పదవికి గాంధీ కుటుంబాన్ని ఎదిరించి పోటీపడిన శశిథరూర్ 1700కు పైగా ఓట్లు తెచ్చుకోవడం గమనిస్తే స్వతంత్ర నిర్ణయాలు తీసుకొనే నాయకుడి అవసరాన్ని పార్టీ శ్రేణులు గుర్తిస్తున్నట్లు స్పష్టం అవుతుంది. ఆ సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకొని, శశిథరూర్‌ను అధ్యక్షునిగా ఎన్నుకొని ఉంటే రాజకీయ పరిస్థితులు భిన్నంగా ఉండేవి. జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రధాని మోడీని దీటుగా ఎదుర్కోగల మేధాసంపద ఉండటమే కాకుండా, అంతర్జాతీయ వ్యవహారాలలో మంచి అనుభవం గల నేత కూడా కావడం గమనార్హం. ‘ఇండియా’ కూటమి ఏర్పాటు సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో బిజెపికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థిని నిలబెట్టాలని సూత్రప్రాయంగా అక్టోబర్ 1న నిర్ణయించారు.ఆ మేరకు ఓ నెల రోజులలో భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాట్లు పూర్తి కావాలని నిర్ణయించారు.




కానీ ఆ దిశలో ప్రయాణం చేయకుండా కీలకమైన కాంగ్రెస్ అడ్డంకులు కల్పిస్తూ రావడంతో ఈ కూటమి చెల్లాచెదురైంది. మరోవంక, బిజెపి ఎత్తుగడలకు తల్లడిల్లిపోతున్నాయి. ఈ సందర్భంగా ఢిల్లీలో ‘లెఫ్ట్ కంచుకోట’గా పేరొందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి వారం రోజుల క్రితం జరిగిన ఎన్నికల నుండి ఓ గుణపాఠం గ్రహించాలి. ఐదేళ్ల విరామం తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు వ్యూహాత్మకంగా ఈ ఎన్నికలు జరిపారు. ఈ ఎన్నికల్లో ఎబివిపి విజయం సాధిస్తుందనే భరోసాతోనే ఎన్నికలు జరిపారు. ఎబివిపి విజయం సాధిస్తే లెఫ్ట్ చివరి స్థావరం కూడా బద్దలైపోయిందని, ఇక దేశంలో తమకు తిరుగులేదని సంకేతం ఇవ్వాలని బిజెపి రంగం సిద్ధం చేసుకుంది. ఓట్ల లెక్కింపులో మొదట్లో ఎబివిపి అభ్యర్థులు ముందంజలో ఉండటంతో టివి ఛానల్స్‌లో విజయోత్సవాలు ప్రారంభం అయ్యాయి.అయితే, అర్ధరాత్రి అయ్యేసరికి లెఫ్ట్ కూటమి ఘన విజయం సాధించడంతో ఇవన్నీ మూగబోయాయి. ఈ మధ్య కాలంలో అక్కడ ఎబివిపి బలం పుంజుకోవడం, యూనివర్సిటీ వ్యవహారాలపై పట్టు సాధించడం జరిగింది. లెఫ్ట్ వెనుకంజ వేస్తూ వస్తోంది. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ పదవికి పోటీ చేసిన ఓ విద్యార్థిని గతంలో ఎప్పుడో బహిష్కరణకు గురైందని చూపుతూ పోలింగ్‌కు కొద్దీ గంటలకు ముందు, తెల్లవారుజామున 2 గంటలకు ఆమె నామినేషన్ చెల్లదని యూనివర్సిటీ ప్రకటించింది. దాని తో ఆమెకు కోర్టుకు వెళ్లి స్టే పొందే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇక ఎబివిపి అభ్యర్థి దాదాపు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పరిస్థితి నెలకొంది. అయితే లెఫ్ట్ కూట మి అప్పటికప్పుడు మేల్కొని, పోటీలో ఉన్న ఓ అంబేద్కర్ వాదంకు చెందిన అభ్యర్థికి మూకుమ్మడిగా మద్దతు తెలపడం ద్వారా ఎబివిపి అభ్యర్థిని ఓడించారు.ఈ విధంగా ప్రతిపక్షాలు ఉమ్మడిగా వ్యూహాత్మకంగా అడుగులు వేసే ప్రయత్నం నేడు దేశంలో కనిపించకపోవడం బిజెపికి ఎదురు లేకుండా చేస్తున్నది. పైగా, ఇదే సమయంలో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన విధానం ఉన్నత విద్యావంతులైన యువతలో ప్రతికూల ప్రభావం చూపిం ది. ఎబివిపి అభ్యర్థుల ఓటమిలో ఈ అంశం కూడా కీలకంగా మారినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఈనాడు బిజెపిని వేధిస్తున్న మరో సమస్య ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న నేతలకు మించి, ప్రత్యర్థి శిబిరంలో నేతలకు ఎక్కువగా ప్రజాదరణ లభిస్తుండటం. ఉదాహరణకు బీహార్‌లో నితీశ్ కుమార్ బిజెపితో చేతులు కలిపి ప్రజల దృష్టిలో పలుచబడ్డారు. నేడు ఆ రాష్ట్రంలో తేజస్వి యాదవ్‌కు ప్రజాదరణ నానాటికీ ఎక్కువగా పెరుగుతుంది. అదే విధంగా మహారాష్ట్రలో బిజెపితో చేతులు కలిపి పదవులు పొందిన నేతలకన్నా ఉద్ధవ్ థాకరే పట్ల సానుభూతి ఎక్కువగా వ్యక్తం అవుతుంది.తమిళనాడులో తాము బిజెపితో చేతులు కలిపిన కారణంగానే రాజకీయంగా చతికిలపడే పరిస్థితి ఏర్పడిందనే అన్నాడిఎంకె నేతలు ఇప్పుడు ఆ పార్టీకి దూరంగా జరిగారు. పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్‌ల ముందు బలహీనమవుతున్న అకాలీదళ్ ‘రైతు వ్యతిరేక పార్టీ’గా ముద్రపడిన బిజెపితో చేతులు కలిపేందుకు వెనకాడుతుంది. కర్నాటకలో తమ రాజకీయ ఉనికి కోసం బిజెపితో చేతులు కలిపిన జెడిఎస్ కారణంగా బిజెపి ఏమేరకు లాభపడగలదో చూడాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును బెదిరించి నోటా కన్నా తక్కువ ఓట్లు మాత్రమే ఉన్నప్పటికీ అత్యధికంగా ఎంపి, ఎంఎల్ఎ సీట్లు పొందినప్పటికీ అటువంటి బెదిరింపులకు ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ లొంగకపోవడంతో అక్కడ పొత్తు సాధ్యం కాలేదు. ఎన్నికల బాండ్ల వ్యవహారం తర్వాత బిజెపి సైతం అన్ని రాజకీయ పార్టీల మాదిరిగా ఓ అవినీతి పార్టీగా స్పష్టమైంది. అయితే, అవినీతిని ఎన్నికలలో ఓ అంశంగా ప్రజలు గుర్తించడం ఎప్పుడో మరచిపోవడంతో ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం లేదు. ఎన్ని బలహీనతలున్నప్పటికీ ప్రతిపక్షాల వైఫల్యాలు బిజెపికి కొండంత అండగా నిలుస్తున్నాయి.

# అన్నపూర్ణ మన తెలంగాణ..దక్షిణాదికి మనమే ఆసరా



హైదరాబాద్,ఈ ఏడాది పలు రాష్ట్రాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో తెలంగాణ బియ్యానికి డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో దక్షిణాదిలోని పలు రాష్ట్రాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో పలు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో వరి పంట సాగు కాలేదు. ఈ ఏడాది తెలంగాణలోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవనప్పటికీ వానాకాలం సీజన్‌లో లక్ష్యం మేరకు 60 లక్షల ఎకరాల్లో వరి పంట సాగయ్యింది. ఇక.. ఈ యాసంగిలోనే దాదాపు 10 లక్షల మేర తక్కువగా 50 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైనట్టు తెలుస్తోంది. దీంతో రాష్ట్ర అవసరాలకు సరిపోను మిగులు బియ్యం అందుబాటులో ఉండడంతో దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ నుంచి బియ్యం కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి.

తెలంగాణ బియ్యానికి పెరిగిన డిమాండ్..

కొద్ది రోజులుగా తెలంగాణ బియ్యానికి డిమాండ్ భారీగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం నుంచి దక్షిణ భారత్‌లోని ఇతర రాష్ట్రాలకు బియ్యం ఎక్కువగా ఎగుమతి కానుందని పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో దుర్భిక్షం నెలకొనగా, కర్నాటకలోని చాలా ప్రాంతాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటు-న్నాయి. ఈ రెండు రాష్ట్రాలకు నెలకు 4 లక్షల టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సరఫరా చేస్తోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఇంకా ఎక్కువగానే సరఫరా చేయాల్సి ఉంటుందని పౌరసరఫరాలశాఖ, ఎఫ్‌సీఐ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిల్లింగ్‌లో జాప్యం.. అందుకే ఆలస్యం

2015-16కు ముందు ఎఫ్‌సీఐ ధాన్యం కొనుగోలు చేసేది. అయితే.. 2015-16 నుంచి ధాన్యం సేకరణను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతుండడంతో పౌరసరఫరాలశాఖ ప్రాధాన్యం పెరిగింది. రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు ఇస్తే మిల్లర్లు మరాడించి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను తిరిగి ఎఫ్‌సీఐకి అప్పజెప్పాలి. ఆరు నెలల క్రితం వరకు మిల్లర్లు బియ్యాన్ని పూర్తిగా ఇవ్వకపోవడం, ధాన్యాన్ని బహిరంగమార్కెట్‌లో అమ్ముకోవడంతో తీవ్ర జాప్యం నెలకొంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్ కఠినంగా వ్యవహరిస్తుండడంతో వానాకాలం సీజన్ బియ్యం పూర్తిగా మిల్లర్ల నుంచి తిరిగొచ్చింది. మరోవైపు ప్రస్తుత యాసంగిలో ధాన్యం సేకరణకు, మిల్లర్ల నుంచి పూర్తిస్థాయిలో బియ్యాన్ని తిరిగి తీసుకునేందుకు పౌరసరఫరాల సంస్థ ఏర్పాట్లు- చేసి ఉంచింది. బియ్యం అందిన వెంటనే, అందుకు సంబంధించిన పైకాన్ని జాప్యం చేయకుండా చెల్లించేందుకు ఎఫ్‌సీఐ కూడా అంగీకరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ సేకరించిన బియ్యాన్ని ఎప్పటికప్పుడు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు ప్రాధాన్యం ఇస్తోంది.

కేరళకు 2లక్షల టన్నుల తెలంగాణ బియ్యంఙ

కేరళ రాష్ట్రానికి తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతి జరగనుంది.దాదాపు 2 లక్షల టన్నులకు పైగా కేరళకు బియ్యాన్ని పంపించేందుకు పౌరసరఫరాలశాఖ చర్యలు చేపడుతోంది. ముందుగా మలయాళ రాష్ట్రానికి వెయ్యి టన్నుల బియ్యాన్ని పంపించాలన అధికారులు నిర్ణయించారు.తెలంగాణ నుంచి బియ్యం కోసం కేరళ అధికారులు ఇప్పటికే పౌరసరఫరాలశాఖ సంప్రదింపులు పూర్తి చేశారు.

## మాదిగలకు ఎంపి సీట్లలో అన్యాయం జరగొద్దు

హైదరాబాద్,కాంగ్రెస్ మాదిగలను దూరం చేసుకోవద్దని మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు

# ఇంటినుంచే ఓటుహక్కుపై అవగాహన

శ్రీకాకుళం,రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా రాష్ట్రంలో ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఇంటి నుంచే ఓటింగ్ చేసే దానిపైనా, పోస్టల్ బ్యాలెట్ వినియోగంపైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. తొలిసారిగా అవకాశం కల్పిస్తున్న ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగిం చుకునే వర్గాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి ఓటు హక్కును సక్రమంగా వినియోగిం చుకునేలా అవగాహన కలిగించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ ఎన్నికల్లో 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికిపైగా అంగవైకల్యం ఉన్నవాళ్లు పోలింగ్ స్టేషన్‌కు వచ్చిగానీ, ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ అండ్ హోం ఓటింగ్‌కు సన్నద్ధత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అధికారులతో సచివాలయం నుచి మీనా జిల్లాల ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశర చేశారు. ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే ముందుగా రిటర్నింగ్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఫారం 12 డి ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికే ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్టు ఎన్నికల అధికారి వెల్లడించారు. ఒకసారి ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం పొందితే వారు నేరుగా పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతారన్న విషయంపై ఓటర్లకు అవగాహన కలిగించాలని ఎన్నికల అధికారి అధికారులకు సూచించారు. ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే వవారి కోసం వీడియో గ్రాఫర్‌తో, ఐదుగురు సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ముందుస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని మీనా అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వివిధ శాఖల ఉద్యోగులు, సర్వీసు ఓటర్లకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని వివరించారు. ఈ మేరకు జిల్లాల్లోని ఎన్నికల అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ మేరకు ప్రతి రిటర్నింగ్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల కలెక్టర్లు హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్లకు తీసుకుంటున్న చర్యలను ఎన్నికల అధికారికి వివరించారు. ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తుండడం వల్ల ఎంతో మంది వృద్ధులకు మేలు కలుగుతుంది. ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టలేని ఎంతో మంది ఓటింగ్ రోజు తీవ్ర ఇబ్బందులు పడి మరీ ఓటు వేస్తూ వస్తున్నారు. కొత్తగా తీసుకువస్తున్న ఈ విధానం వల్ల అటువంటి వృద్ధులు.. ఈ తరహా ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందడంతోపాటు సులభంగా ఓటును వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. ఇటువంటి వృద్ధులు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో కనీసం ఐదు నుంచి పది మంది, ఇంకా ఎక్కువ మంది ఉండే అవకాశముంది.

# నిప్పుల కుంపటి..

హైదరాబాద్: ఈ వేసవిలో ఎండలు భగ్గమని మండిపోనున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ దేశంలోని చాల ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్ల డించింది. తూర్పు ,ఈశాన్య , వాయువ్య భారతంలోని కొన్ని ప్రాంతాలు మినహా ఎక్కవ శాతం సాధారణం కంటే గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ రా ష్ట్రంలో కూడా జూన్ వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అ వకాశాలు ఉన్నట్టు ఐఎండి వెల్లడించింది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉ న్నాయి.ఏప్రిల్ నుంచి తెలంగాణలో వడగాల్పుల తీవ్రత కూ డా పెరిగే అవకాశాలు ఉన్నట్టు హెచ్చరించింది. రాష్ట్రంలోని కొ న్ని ప్రాంతాలలో సాధరణం కంటే ఎక్కువ రోజులు వడ గాల్పులు వీచే అవకాశాలు ఉన్నాయి .ఈ వేసవిలో సగటున ఆరు నుంచి తొమ్మిది రోజుల పాటు వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నట్టు వెల్లడించింది. ఏప్రిల్ నెలలో కొన్ని ప్రాంతాలలో వీటి తీవ్రత అధికంగా ఉండనుంది, ఈ నెలలో మూడు నుంచి నాలుగు రోజుల పాటు వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. ఏప్రిల్ నెల తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం కూడా సగటు నుండి సగటు కంటే ఎక్కువగా 88శాతం నుండి 112శాతం వరకూ ఉండనుంది. దక్షిణ ద్వీపకల్పంలోని తెలంగాణ రాష్ట్రంలో చాలా ప్రాంతాలలో సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్టు వెల్లడించింది.

మరో 5రోజులు నిప్పులు !

తెలంగాణ రాష్ట్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రాగల 5రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు డిగ్రీలు పెరిగి సగటున 44డిగ్రీలు నమోదయ్యే అవాకాశాలు ఉన్నట్టు ఐఎండి వెల్లడించింది.సోమవారం రాష్ట్రంలో అత్యధికంగా 43డిగ్రీలకు పెరిగాయి. సిద్దిపేట జిల్లా చిట్యాల్‌లో గరిష్టంగా 43 డిగ్రీలు నమోదయ్యాయ్యి. నల్లగొండ జిల్లా ముడుగుల పల్లిలో కూడా 43డిగ్రీలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా దుల్‌మిట్టలో 42.9, నల్లగొండ జిల్లా తిమ్మాపూర్‌లో 42.9, తెల్దేవరపల్లిలో 42.7, పెద్దపల్లి జిల్లా ఎక్లాస్‌పూర్‌లో 42.9, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెళ్లపాడులో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.రాష్ట్రంలో దస్తూరాబాద్, సుజాతానగర్, కల్వాయ్, ఇబ్రహీంపేట్ , నిజాంపేట్ , మర్తన్నపేట్, ఎడపల్లె, మల్కాపూర్ ,వంకులం, నామ్‌పల్లి, ఖసీంపేట్,లక్ష్మీదేవరపల్లి తదితర ప్రాంతాల్లో కూడ 42.6డిగ్రీలు నమోదైయ్యాయి.

గ్రేటర్‌లో 41డిగ్రీల పైనే:

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కూడా 41డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జియాగూడ, కూకట్‌పల్లి ,కుత్బుల్లాపూర్, చార్మినార్, ముషీరాబాద్, ఉప్పల్, గోల్కొండ, మారెడుపల్లి, శేరిలిగంపల్లి, కాప్రా, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో 41నుంచి 41.7డిగ్రీల వరకూ ఉష్ణోగతలు నమోదయ్యాయి.

## వెటనే పెన్షన్ల పంపిణీ చేయండి

అమరావతి,రాష్ట్రంలో తక్షణమే ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎస్‌కు టీడీపీ అధినేత ఫోన్ చేశారు. పెన్షన్ల పంపిణీపై ఎన్నికల సంఘం ఎటువంటి ఆంక్షలు పెట్టలేదన్న విషయాన్ని ప్రస్తావించారు. వృద్దులు, వికలాంగులు ఇబ్బందులు పడకుండా వారి ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయాల్సిన అసవరం ఉందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా వెంటనే పెన్షన్ పంపిణీ చేపట్టాలని వినతి చేశారు. ఎండల సమయంలో లబ్దిదారులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ప్రధాన కార్యదర్శికి టీడీపీ అధినేత వివరించారు. సచివాలయం సిబ్బంది, ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ చేపట్టలన్నారు. ఏ ఒక్క లబ్దిదారుడికీ ఇబ్బంది లేకుండా వెంటనే పంపిణీ ప్రక్రియను చేపట్టాలని చంద్రబాబు ఫోన్‌లో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనాతోనూ చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు.

# కిషన్ రెడ్డితో ఒరిగిందేమీ లేదు



హైదరాబాద్,సికింద్రాబాద్ ఎంపిగా, మంత్రిగా తెలంగాణకు కిషన్ రెడ్డి చేసిందేమీ లేదని అందుకే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కిషన్ రెడ్డి ఈ దఫ గెలవడం అసాధ్యమని అన్నారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని అన్నారు. ఇదే సమయంలో కేంద్రమంత్రిగా ఉండి సికింద్రాబాద్‌కు కిషన్ రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. సికింద్రాబాద్ ఎంపీగా దానం నాగేందర్‌ను గెలిపించడమే మా బాధ్యత అని వ్యాఖ్యలు చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాటపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ..'సభకు 10 లక్షల మందిని తరలిస్తాం. ఏప్రిల్ ఎనిమిదో తేదీన నాంపల్లిలో ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో మరోసారి మీటింగ్ ఉంటుంది. బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. భువనగిరి, నల్లగొండలో ఖచ్చితంగా గెలుస్తాం. సికింద్రాబాద్‌లో కూడా దానం నాగేందర్‌ను గెలిపిస్తాం. దానం గెలుపు బాధ్యత మాదే. తెలంగాణలో పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా ఈసారి గెలిచాం. బీఆర్ఎస్ పార్టీది కుటుంబ పాలన. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలకు అర్థం లేదు. కేసీఆర్ చేసిన పాపాలకు వర్షాలు కూడా పడటం లేదు. కేసీఆర్ కేబుల్ బ్రిడ్జ్ వేసి హైదరాబాద్ అభివృద్ధి అంటున్నాడు. 40వేల కోట్లతో మూసి ప్రాజెక్ట్‌ను ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తాం. కేంద్రమంత్రిగా ఉండి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌ను పట్టించుకోలేదు. ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కిషన్ రెడ్డి మతాల మధ్య గొడవలు పెట్టి గెలవాలని చూస్తున్నాడు. అది సాధ్యం కాదు. కాంగ్రెస్ కచ్చితంగా 14 సీట్లు గెలుస్తుంది' అని కామెంట్స్ చేశారు.

దానం నాగేందర్ మాట్లాడుతూ..'సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కోమటిరెడ్డి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను. రాబోయే ఎన్నికల్లో నేను గెలవడానికి అందరి సహకారం కావాలి. తుక్కుగూడ సభ విజయవంతం చేయడానికి సమావేశమయ్యాం' అని వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి, ఏప్రిల్ 2: తుక్కుగూడలో ఈనెల 6న బహిరంగ సభకు కాంగ్రెస్ సన్నాహాలు చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం తుక్కుగూడలోని రాజీవ్ గాంధీ సభ ప్రాంగణాన్ని సీఎం రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యేలు, మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తుక్కుగూడలో బహిరంగ సభ ఏర్పాట్లపై సమావేశం అయ్యామని.. 10 లక్షల మందిని బహిరంగ సభకు తరలిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ ఎంపీగా నాగేందర్‌ను గెలిపించడమే తమ బాధ్యత అని చెప్పుకొచ్చారు. 8న నాంపల్లిలో ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో మరోసారి మీటింగ్ ఉంటుందన్నారు. బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని.. భువనగిరి, నల్లగొండ ఖచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లో నాగేందర్‌ను కూడా గెలిపిస్తామన్నారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని విమర్శించారు. కాంగ్రెస్ 10 ఏండ్లు అధికారంలో లేకున్నా ఈసారి గెలిచామన్నారు. కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా సికింద్రాబాద్‌ను పట్టించుకోలేదని, అభివృద్ధి చేయలేదని అన్నారు. కిషన్ రెడ్డి మతాల మధ్య గొడవలు పెట్టి గెలవాలని చూస్తున్నారని.. అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ 14 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 40 వేల కోట్లతో మూసీ ప్రాజెక్టును ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కేసీఆర్ కేబుల్ బ్రిడ్జ్ వేసి హైదరాబాద్ అభివృద్ధి అని అంటున్నారని.. హరీష్ రావు మాటలకు అర్థం లేదని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన పాపాలకు వర్షాలు పడటం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో భయపెడుతున్న ఎండలు

హైదరాబాద్, వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే అనేక చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటిపోగా, వాతావరణశాఖ హెచ్చరికలు మరింత భయపెడు తున్నాయి. ఏపీ, తెలంగాణలో సూర్యుడి విశ్వరూపంతో .. పలు ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ.. ఇళ్ల నుంచి బయటికి రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఐఎండీ అంచనా వేసింది. మరి ఏప్రిల్ మొదటి రోజునే ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి ఎలాగుంటుందన్న ఆందోళన కలుగుతోంది. ఇదే ఇప్పుడు తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళ్లుమనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయంటే సూర్యుడి విశ్వరూపం ఏ రేంజ్‌లో ఉందో అర్థంచేసుకోవచ్చు. ఒకవైపు ఎండలు దంచికొడుతుంటే, ఇంకోవైపు వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ తెలంగాణలో 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 37 మండలాలకు వార్నింగ్ ఇచ్చింది. అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని ఐఎండీ చెబుతోంది. ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది ఇప్పుడున్న ఉష్ణోగ్రతలు శాంపిల్స్ మాత్రమేనని, ముందుముందు ఇంకా పెరుగుతాయంటోంది. ఏప్రిల్ సెకండ్ వీక్ తర్వాత నిప్పుల కుంపటేనని హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరిస్తోంది వాతావరణశాఖ. అందుకే అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని చెబుతోంది. తెలుగు రాష్టాల్లో భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. సాధారణం కంటే 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో



పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏపీలో మంగళవారం 37 మండలాల్లో వడగాల్పుల ముప్పు అధికంగా ఉంటుందని వెల్లడించారు. అటు, తెలంగాణలోని 15 జిల్లాల్లో వడగాల్పుల ముప్పు ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు అధికారులు అలర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసరం అయితే తప్ప పగటిపూట బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు. తెలంగాణలో సగటున 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. రాబోయే 5 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మంచినీరు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని.. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని చెబుతున్నారు. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు..మెదక్ ఎంపి అభ్యర్థి రఘునందన్‌పై కేసు

హైదరాబాద్,మెదక్ లోక్ సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుపై ఎఫ్ఐఆర్ నమోదయింది. బీఆర్ఎస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై కేసు నమోదయింది. మాజీ మంత్రి హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని ఈసీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇటీవల సంగారెడ్డిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. తన పేరు తీస్తే గుడ్డలూడదీసి కొడతానంటూ మాజీ మంత్రి హరీష్, కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డిలనునుద్దేశించి కామెంట్ చేశారు. సంగారెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో పండబెట్టి తొక్కుతానంటూ వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలయ్యేంత వరకు రఘునందన్ అనే పేరు తీయొద్దంటూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు రఘునందన్ రావు. ప్రస్తుతం మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా ఉన్నారు. ఇక కాంగ్రెస్ నుంచి నీలం మధు ముదిరాజ్, బీఆర్ఎస్ నుంచి మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఇదిలావుంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ మొదటి ముద్దాయిగా, హరీశ్ రావును రెండో ముద్దాయిగా చేర్చాలంటూ మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన రావు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ట్యాపింగ్‌లో దేవుడిని కూడా వదిలిపెట్టలేదన్నారు. యాదగిరి గుట్ట దేవాలయాన్ని కట్టడానికి బంగారం దుకాణదారులను భయపెట్టినట్లు అనిపిస్తుందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో మొదటి



ముద్దాయి కేసీఆర్, రెండో ముద్దాయి హరీశ్‌రావు, మూడో ముద్దాయిగా వెంకట రామిరెడ్డి, నాలుగో ముద్దాయిగా కేటీఆర్ పేరు చేర్చాలని డిమాండ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో మూడున్నర కోట్లు పట్టుకున్నా, రాజగోపాల్ రెడ్డి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. వివేక్ వెంకటస్వామి కూడా బాధితుడే కదా, మరి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని అడిగారు. ఎమ్మెల్సీ వెంకట రామిరెడ్డిని కొత్త వియ్యంకుడు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి కాపాడుతున్నారా అని ప్రశ్నించారు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్టీఫెన్ రవీంద్ర చెప్పిన రూ.30 కోట్లు ఎక్కడికి పోయాయన్న ఆయన, రేవంత్ రెడ్డి నోటుకు ఓటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారాన్ని పక్కన పెట్టి, మునుగోడు, దుబ్బాక ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నారని నిలదీశారు.

# జనసేనలో వాలిన నేతలకే ప్రాధాన్యం

అమరావతి,అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఏపీ పాలిటిక్స్ రసవత్తరంగా మారతున్నారు. పొత్తుల్లో భాగంగా పలువురికి టిక్కెట్లు దక్కలేదు. దీంతో ఎక్కడా టిక్కెట్లు దక్కని వారు ఎదుటి పార్టీలో చేరి టిక్కెట్లు దక్కించుకుంటున్నారు. కండువా మారిస్తే టికెట్ గ్యారంటీ. పారాచూట్ నేతలు భారీ సంఖ్యలో జనసేనలో చేరిపోతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను తన్నుకు పోతున్నారు. దిగుమతి అవుతున్న నేతలతో ఉన్న నేతలు పరేషాన్ అవుతున్నారు. కండువా మార్చితే టిక్కెట్ ఖాయమని తేలిపోతోంది. ముఖ్యంగా టీడీపీ నుంచి జనసేనలో చేరుతున్న నేతలకు టికెట్‌పై అభయం దొరుకుతోంది. వైసీపీ నుంచి కూడా జనసేనలోకి జంప్ కొట్టి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు దక్కించుకున్నారు కొందరు నేతలు. పొత్తులో భాగంగా 21 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లను జనసేనకు కేటాయించారు. జనసేన నుంచి చాలామంది నేతలు టిక్కెట్లపై ఆశలు పెట్టుకున్నా ..టీడీపీ, వైసీపీ నుంచి దిగుమతి చేసుకున్న నేతలే ఎక్కువగా టికెట్లు దక్కించుకున్నారు. జనసేనకు కేటాయించిన రెండు ఎంపీ స్థానాల్లో ఒకటి వైసీపీ నుంచి వచ్చి జనసేన కండువా కప్పుకున్న నేతకే దక్కింది. ఇక జనసేనకు కేటాయించిన 21 అసెంబ్లీ స్థానాల్లో కూడా మూడో వంతుకు పైగా సీట్లను టీడీపీ, వైసీపీ నుంచి వచ్చిన లీడర్సే దక్కించుకున్నారు. ఇది మొదటినుంచి జనసేననే నమ్ముకున్న నేతలకు మింగుడు పడకపోయినా, పొత్తు ధర్మం వాళ్లను చిత్తు చేస్తోంది.టీడీపీ నుంచి అవనిగడ్డ అసెంబ్లీ టికెట్ ఆశించారు మండలి బుద్ధప్రసాద్. కానీ పొత్తులో ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో టీడీపీ నుంచి జనసేనలో చేరిన మండలికి లైన్ క్లియర్ అయిందని సమాచారం. ఇక పాలకొండలో కూడా సేమ్ సీన్ కనిపిస్తోంది. పాలకొండ అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో నిమ్మక జయకృష్ణ..టీడీపీని వీడి జనసేన కండువా కప్పుకున్నారు. ఆయనకు టికెట్ రావడం లాంఛనమే అంటున్నారు. అంతకుముందు సైకిల్ దిగి జనసేన కండువాను కప్పుకున్న పులపర్తి రామాంజనేయులు.. భీమవరం జనసేన అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇక వైసీపీ నుంచి జనసేనలో చేరిన ఆరణి శ్రీనివాసులకు తిరుపతి అసెంబ్లీ టికెట్ దక్కింది. వాయిస్: జనసేన కండువా కప్పుకున్న వంశీకృష్ణకు టికెట్ దక్కింది. ఇక వైసీపీ నుంచి జనసేనలో చేరిన పంచకర్ల రమేష్ బాబు పెందుర్తి అసెంబ్లీ టికెట్ దక్కించుకున్నారు. రైల్వే కోడూరు జనసేన అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర రావు కూడా వైసీపీ నుంచి పవన్ పార్టీలోకి దిగుమతి అయిన నేత. ఇక దశాబ్దానికి పైగా వైసీపీతో కొనసాగిన బాలశౌరి జనసేన నుంచి మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. టీడీపీ, వైసీపీ నుంచి జనసేనకు అభ్యర్థులు సప్లయ్ అవుతున్నారు. పారాచూట్ నేతలకు టికెట్ గ్యారంటీ స్కీమ్.. గ్లాసు నేతలను పరేషాన్ చేస్తోంది.

# తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ఫెయిల్యూర్



హైదరాబాద్, రైతులందరికీ రైతుబంధు డబ్బులు ఇప్పటికీ రాలేదని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. మంగళవారం నాడు తెలంగాణఏ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రైతు బంధు కోసం గత ప్రభుత్వం ఖజానాలో ఉంచిన నగదును సీఎం రేవంత్‌రెడ్డి మింగేశారని ఆరోపించారు. రైతు బంధు నిధులు కొన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి, ఇంకొన్ని ఢిల్లీకి కప్పం కట్టారని విమర్శించారు. ఇంత తక్కువ కాలంలోనే ఫెయిల్యూర్ అయిన ప్రభుత్వాన్ని దేశంలో ఎక్కడ చూడలేదన్నారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణిలోనే రేవంత్ ప్రభుత్వం పని చేస్తుందని మండిపడ్డారు. రైతు శ్రేయస్సును రేవంత్ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. బీఆర్ఎస్ రోడడెక్కితే తప్పా ప్రాజెక్టుల నుంచి నీరు వదలరా? అని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలను ఈ ప్రభుత్వం ఎందుకు రద్దు చేస్తోందని ప్రశ్నించారు. పేదల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా పక్కన పెట్టారన్నారు. పేదలను ఇబ్బంది పెడితే దేవుని ఆశీర్వాదం కూడా రేవంత్‌కు ఉండదన్నారు. 2014నుంచి 23వరకు ఫోన్ ట్యాపింగ్ జరిగింది అంటున్నారని చెప్పారు. అయితే అప్పటి హోం సెక్రెటరీలను, డీజీపీలను ఇతర అధికారులను అందరినీ విచారించాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆ ఒక్క సామాజిక వర్గాన్ని ఎందుకు టా÷-గ్గ్ం÷ట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ కేబినేట్‌లో అందరూ రెడ్డి అధికారులే ఉన్నారన్నారు. పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలని రేవంత్ అన్నారని.. మరి తమ పార్టీ నుంచి గెలిచిన వారిని ఎందుకు కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని నిలదీశారు.రేవంత్‌ను రాళ్లతో కొట్టాలా లేక వాళ్లను కొట్టాలా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి నీతి వంతుడివి అయితే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన నీతులు చెప్పడం కాదని.. రాజీనామా చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని చెప్పారు. కే. కేశవరావు 85ఏళ్ల వయస్సులో ఎందుకు పార్టీ మారారని ప్రశ్నించారు. ఆయనకు పార్టీ ఏం తక్కువ చేసిందని నిలదీశారు. దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయ లక్ష్మి పదవులకు రాజీనామా చేయాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు.

## మాదిగలకు ఎంపి సీట్లలో అన్యాయం జరగొద్దు

హైదరాబాద్,కాంగ్రెస్ మాదిగలను దూరం చేసుకోవద్దని మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతోందని.. రేవంత్ పాలనపై ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా పాలన కొనసాగిస్తోందని చెప్పారు. మాదిగ సమాజం చాలా వెనకబాటులో ఉందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మాదిగలు కీలక పాత్ర పోషించారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని విమర్శలు వస్తున్నాయన్నారు. ఒక మాదిగ బిడ్డగా తనకు బాధగా ఉందని చెప్పారు. మాదిగల గురించి కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తుందని అనుకుంటున్నానన్నారు. మాదిగల కోట మాదిగలకు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. కాంగ్రెస్ మాదిగలకు దూరం కాకూడదని... దీన్ని సరిచేయాలని కాంగ్రెస్ పెద్దలకు వేడుకుంటున్నానని చెప్పారు. ఒక జాతికి అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ పునరాలోచన చేయాలని కోరారు. రేవంత్ రెడ్డికి తెలియకుండా ఇది జరిగింది కాదని అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ మాదిగల అభివృద్ధికి కట్టుబడి ఉన్న పార్టీ అని మోత్కుపల్లి నర్సింహులు అన్నారు.

# 400 సీట్లు లక్ష్యంగా బిజెపి పావులు

న్యూఢిల్లీ, సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు బిజీగా ఉన్నాయి. అధికారం కోసం ఎన్డీయే, ఇండియా కూటమి పోటీపడుతున్నాయి. వరుసగా మూడోసారి విజయం సాధించి.. హ్యాట్రిక్ కొట్టే లక్ష్యంతో బీజేపీ దూసుకెళ్తోంది. అడ్డుగా ఉన్న విపక్ష పార్టీలను బొక్కలో తోసే ప్రయత్నాలు మరోవైపు చురుకుగా సాగుతున్నాయి. కేజ్రీవాల్‌ను ఇప్పటికే లోపలేశారు. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఊచలు లెక్కించేలా చేశారు. కాంగ్రెస్ మెడలు వంచి ఐటి కేసులతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. మరోవైపు కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవకుంటే మరో ఐదేళ్లు ఆగాల్సి ఉంటుంది. విక్ష పార్టీలతో కలసి ఇండియా కూటమి ఏర్పాటు చేసినందున గెలుపు లక్ష్యంగా పోరాడుతోంది.

అయితే నిధుల సమస్య కూడా తీవ్రంగా వెన్నాడుతోంది. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడంతో పాటు.. 400 సీట్లను గెలుచుకోవాలనే లక్ష్యంతో బిజెపి వ్యూహాలను సిద్ధం చేస్తోంది. మరోవైపు ఓట్ల శాతాన్ని 50 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. 400 సీట్లు వచ్చినా బీజేపీ 50 శాతం ఓట్లను సాధించగలదా అనేది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. 400 సీట్లు ఒక పార్టీ సాధించడం ప్రస్తుత పరిస్థితుల్లో అసాధ్యం గతంలో కాంగ్రెస్‌కు పోటీగా ఇతర పార్టీలు అంతగా ప్రభావం చూపించకపోవడంతో ఆ పార్టీ ఎక్కువ సీట్లతో అధికారాన్ని చేపట్టగలిగింది. అయితే దేశంలో 400కు పైగా సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ ఎప్పుడూ 50 శాతం ఓట్లు సాధించలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ తన లక్ష్యాన్ని ఎలా చేరుకోగలదా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. స్వతంత్ర భారత దేశంలో ఇప్పటివరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరగాయి. 10 సార్లు మాత్రమే పూర్తి మెజారిటీతో ఒకే పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది. కాంగ్రెస్ ఏడుసార్లు, బీజేపీ రెండుసార్లు, జనతా పార్టీ ఒకసారి పూర్తిస్థాయి మెజార్టీ సీట్లు గెలుపొందాయి. 7 సార్లు లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాలేదు. దేశంలో ఇప్పటి వరకు అత్యధిక సీట్లు, ఓట్లు 1984లో కాంగ్రెస్ పార్టీ సాధించింది. అదికూడా ఇందిర హత్యానంతరం రాజీవ్ పగ్గాలు




చేపట్టినప్పుడు మాత్రమే సాధ్యం అయ్యింది. ఇందిరా గాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 48.1 శాతం ఓట్లతో 415 సీట్లు గెలుచు కోగలిగింది. 415 సీట్లను గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 50 శాతం దాటలేదు. ఇందిరా గాంధీ హత్య తర్వాత దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ 48.1 శాతం ఓట్లతో 415 సీట్లు గెలుచు కోగలిగింది, ఇది ఇప్పటి వరకు అతిపెద్ద రికార్డు. కాంగ్రెస్ 7 సార్లు పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ఒక్కసారి కూడా 50 శాతం ఓట్లు సాధించలేకపోయింది. ప్రస్తుతం బీజేపీ మాత్రం 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలవడమే కాకుండా 50 శాతం ఓట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2024 ఎన్నికల్లో తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు బీజేపీ అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. 50 శాతం ఓట్లు దాటాలంటే బీజేపీకి 2019 కంటే 12 శాతం అధికంగా ఓట్లు రావాలి. దీనికోసం ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు చిన్న పార్టీలతో బీజేపీ చేతులు కలిపింది. ఇప్పటి వరకు ఉత్తరాదిలోనే అత్యధిక సీట్లు సాధించిన బిజెపి ఇప్పుడు దక్షిణాదిలో కూడా సీట్లు సాధించేలా పొత్తులకు శ్రీకారం చుట్టింది. అయోధ్యతో కొంత మార్పు వచ్చిందని భావిస్తోంది. ఈ ఎన్నికల్లో కమలం పార్టీ తన లక్ష్యాన్ని చేరుకుంటుందా లేదా అనేది జూన్4న తేలిపోనుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com